Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 209 మేడ్చల్ మల్కాజ్‌గిరి 19 ఆగష్టు 2023 శనివారం పేజీలు : 4

## వసుంధర రాజేకు బీజేపీ షాక్!

జైపూర్ : రాజస్థాన్‌కు రెండుసార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన బీజేపీ అగ్రనాయకురాలు వసుంధర రాజేకు ఆ పార్టీ షాక్ ఇచ్చింది. మరో మూడు నెలల్లోపే అసెంబ్లీ ఎన్నికలు జరగ నున్న రాజస్థాన్‌కు ఎన్నికల నిర్వహణ కమిటీని, పార్టీ మేనిఫెస్టో కమిటీని బీజేపీ అధిష్ఠానం ప్రకటించింది. అయితే, ఈ రెండు కీలక కమిటీల్లోనూ వసుంధర పేరు లేకపోవటం గమనార్హం. ఆమెతోపాటు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సీపీ జోషి, అసెంబ్లీలో బీజే పీ పక్ష నేత రాజేంద్ర రాథోడ్ పేర్లు కూడా ఈ కమిటీల్లో లేకపోవటం రాజకీయ పరిశీలకులను విస్మయపరిచింది. రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సతీష్ పూనియా వంటి కీలక నేతలను కూడా పక్కనపెట్టారు.



# క్లాస్ రూమ్‌గా మారిన కేసీఆర్ ఫామ్‌హౌస్

## సర్వే రిపోర్టు పక్కన పెట్టుకుని నెగిటివ్ ఫీడ్ బ్యాక్ ఉన్న ఎమ్మెల్యేలకు తలంటుతున్న కేసీఆర్

హైదరాబాద్ : సిట్టింగ్ ఎంఎల్ఏలకు కేసీయార్ క్లాసులు మొదలయ్యాయా ? పార్టీ వర్గాలు అవుననే అంటున్నాయి. రాబోయే ఎన్నికల్లో టికెట్లు ఇచ్చే విషయమై కేసీఆర్ కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. ఎర్రవల్లిలోని ఫాం హౌజ్ లో కేసీయార్ ఒంటరిగా కూర్చుని అనేక కాంబినేషన్లతో జాబితాను రెడీ చేస్తున్నారు. శ్రావణమాసం మొదలవ్వగానే మొదటి జాబితాను ప్రకటించాలనే ఉద్దేశ్యంలో ఉన్నారు. అవసరానికి మంత్రులు కేటీఆర్ లేదా హరీష్ రావులను పిలిపించుకుని మాట్లాడుతున్నారు. మొత్తానికి ప్రకటించాలని అనుకుంటున్న మొదటి జాబితాపై పెద్దఎత్తునే కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగానే కొందరు ఎంఎల్ఏలను ఫాంహౌజ్ కు పిలిపించుకుని ఫుల్లుగా క్లాసులు పీకినట్లు సమాచారం. ఒకపుడు సిట్టింగ్ ఎంఎల్ఏలందరికీ మళ్ళీ టికెట్లిస్తానని స్వయంగా కేసీయారే ప్రకటించారు. అయితే రెగ్యులర్ గా చేయించుకుంటున్న సర్వేల్లో సిట్టింగుల్లో ఎంతమంది మీద వ్యతిరేకత ఉందో బయటపడిందట. సిట్టింగులందరికీ టికెట్లిస్తే పార్టీ ఓడిపోవటం ఖాయమని అర్ధమైందట. అందుకనే సర్వేల్లో ఫీడ్ బ్యాక్ బాగా ఉన్న వాళ్ళకే టికెట్లని కొత్త ఆలోచన చేశారట. చేయించుకుంటున్న సర్వే రిపోర్టుల్లో భాగంగానే ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ముగ్గురు ఎంఎల్ఏలను పిలిపించుకుని క్లాసులు పీకినట్లు తెలుస్తోంది. వాళ్ళపైన ఉన్న ఆరోపణలు, వాటికి ఆధారాలను కూడా చూపించి మాట్లాడారట. పార్టీలో నేతలతో గొడవలు, భూకబ్జాలు లాంటి రిపోర్టులను చూపించి మాట్లాడారట. దాంతో ఏమి సమాధానం చెప్పాలో వాళ్ళకి అర్ధంకాలేదట. తొందరలోనే ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లోని కొందరు ఎంఎల్ఏలకు ఫోన్లు వెళ్ళే అవకాశాలున్నాయని పార్టీవర్గాల సమాచారం. అత్యంత వివాదాస్పదంగా ఉంటు, బాగా నెగిటివ్ ఫీడ్ బ్యాక్ వచ్చిన సుమారు 20 మంది ఎంఎల్ఏలతో మాట్లాడాలని కేసీయార్ అనుకున్నారట. అందుకనే ఫాంహౌజ్ నుండి ఫోన్లు చేయించి వాళ్ళని పిలిపించి మాట్లాడుతున్నది. సిట్టింగుల మీద ఉన్న ఆరోపణలకు సంబంధించి కచ్చితమైన ఆధారాలను కూడా నమ్మకస్తులైన వ్యక్తుల ద్వారా కేసీయార్ ఫీడ్ బ్యాక్ తెప్పించుకున్నారట. దాన్ని ముందుపెట్టే ఎంఎల్ఏలతో మాట్లాడుతున్నారని సమాచారం. అందుకనే వాళ్ళు కూడా ఆరోపణలన్నీ తప్పులని సమాధానం చెప్పలేకపోతున్నారు. అందుకనే కనీసం ఓ 25 మంది సిట్టింగులకు టికెట్లతో కోత తప్పదని ప్రచారం మొదలైంది.

# బిజెపిలో ఈటల 'మాట'కు విలువ లేదా?



హైదరాబాద్ : బీజేపీలో ఈటల రాజేందర్ ప్రభావం ఏమీ లేదా? ఆయన మాటలను ఎవరూ వినడం లేదా? అంటే రాజకీయ వర్గాల నుంచి అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. ఎన్నికల నిర్వహణ కమిటీ అధ్యక్షుడిగా అధిష్ఠానం ఈటల రాజేందర్‌కు కీలక పదవి ఇచ్చినా.. పార్టీ నాయకుల్లో మాత్రం ఆయన మాటకు విలువ లేదని తెలిసింది.

తాజాగా మాజీ మంత్రి చంద్రశేఖర్ బీజేపీకి రాజీనామా చేయడమే అందుకు నిదర్శనమని విశ్లేషకులు భావిస్తున్నారు. తెలంగాణలో ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అవకాశం కోసం చూస్తున్న నాయకులు పార్టీలు మారుతున్నారు. దీంతో బీజేపీ నుంచి ఇతర పార్టీల్లోకి వెళ్లిపోయేలా కనిపించిన నాయకులకు బుజ్జగించే బాధ్యతను ఈటల తీసుకున్నారు. కానీ ఆయన మాటలను ఎవరూ వినడం లేదని తెలిసింది. బీజేపీ సీనియర్ నేత అయిన చంద్రశేఖర్ ఇంటికి వెళ్లి మరీ పార్టీ మారొద్దని ఈటల చెప్పారని సమాచారం. కానీ చంద్రశేఖర్ రెడ్డి తాజాగా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి రాజీనామా లేఖ పంపారు. బీజేపీలో చేరిన ఉద్యమకారులకు గౌరవం లేదని ఆరోపించి మరీ బయటకు వెళ్లిపోయిన ఆయన.. కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. 1985 నుంచి 20008 వరకు వికారాబాద్ ఎమ్మెల్యేగా చంద్రశేఖర్ అయిదు సార్లు గెలిచారు. 2019 ఎన్నికల్లోకాంగ్రెస్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత బీజేపీలో చేరారు. ఇప్పుడు తిరిగి కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారు. మరోవైపు ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు విషయంలోనూ ఈటల దౌత్యం పనిచేయలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేసీఆర్‌పై కోపంతో బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన ఈ ఇద్దరు నేతలను ఈటల కలిసి బీజేపీలోకి రప్పించే ప్రయత్నం చేశారు. కానీ పొంగులేటి, జూపల్లి కాంగ్రెస్‌లో చేరడంతో ఈటలకు దెబ్బ పడిందనే అంటున్నారు. ఇప్పుడు బీజేపీలో ఈటలకు ఏం కలిసి రావడం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.





## వైరల్‌గా మారిన రాహుల్ గాంధీ 'టీ' పాయింట్.. మన తెలంగాణలోనే..!!

వరంగల్‌లోని కాజీపేటలో జాతీయ రహదారి పక్కన రాహుల్ గాంధీ ఫ్యామిలీ టీ పాయింట్ ఏర్పాటు చేయగా సోషల్ మీడియాలో ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ స్టాల్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. దీనికి కారణం ఓ ఫ్లెక్సీ. సదరు ఫ్లెక్సీలో 'టీ తాగితే మైండ్ ఫ్రెష్ అవుతుంది.. రాహుల్ గాంధీ గెలిస్తే దేశం ఫ్రెష్ అవుతుంది' అని ట్యాగ్ లైన్ రాసి ఉంది. దీంతో క్రియేటివిటీ అదిరిందంటూ నెటిజన్‌లు కామెంట్ చేస్తున్నారు. అభిమానానికి హద్దు ఉంటుంది కానీ వీరాభిమానానికి హద్దులు పెట్టలేం. కాంగ్రెస్ పార్టీకి దేశంలో వీరాభిమానులు చాలా మందే ఉన్నారు. ఎన్నో ఏళ్ల పాటు ప్రజలు కలలు కన్న తెలంగాణను ఇచ్చిన కాంగ్రెస్ అంటే తెలుగు ప్రజలకు కూడా అభిమానమే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కీలక నేత రాహుల్ గాంధీ వీరాభిమాని ఒకరు వినూత్నంగా ఆలోచించారు. వరంగల్‌లోని కాజీపేటలో రాహుల్ గాంధీ ఫ్యామిలీ టీ పాయింట్ ఏర్పాటు చేయగా సోషల్ మీడియాలో ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ స్టాల్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. దీనికి కారణం ఓ ఫ్లెక్సీ. సదరు ఫ్లెక్సీలో 'టీ తాగితే మైండ్ ఫ్రెష్ అవుతుంది.. రాహుల్ గాంధీ గెలిస్తే దేశం ఫ్రెష్ అవుతుంది' అని ట్యాగ్ లైన్ రాసి ఉంది. దీంతో క్రియేటివిటీ అదిరిందంటూ నెటిజన్‌లు కామెంట్ చేస్తున్నారు. టీని, రాహుల్ గాంధీని కలుపుతూ తయారు చేసిన స్లోగన్ అద్భుతంగా ఉందని పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. అటు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి క్రేజ్ నెమ్మదిగా పెరుగుతోంది. తమ పార్టీలో జవసత్వాలు నింపేందుకు రాహుల్ గాంధీ తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఇటీవల భారత్ జోడో యాత్ర పేరుతో దేశవ్యాప్తంగా పర్యటించారు. జోడో యాత్ర కాంగ్రెస్ పార్టీకి మంచి మైలేజ్‌ను తెచ్చిపెట్టింది. ఇటీవల కర్ణాటక ఎన్నికల్లో అనూహ్య రీతిలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఇదే తరహాలో ఇప్పుడు తెలంగాణలోనూ అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ నేతలు కృషి చేస్తున్నారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా తమకు ఓ అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు కోరుతున్నారు. ఈ మేరకు ప్రచారం ముమ్మరం చేశారు. కర్ణాటక ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ పార్టీ వర్సెస్ బీజేపీగా ఉన్న పరిస్థితిని ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ వర్సెస్ కాంగ్రెస్ పార్టీగా మార్చేశారు. కాగా రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో భాగంగా పలు చోట్ల టీ స్టాళ్లను సందర్శించారు. ఛాయ్ వాలాగా ప్రచారం చేసుకుంటున్న ప్రధాని మోదీని టార్గెట్ చేస్తూ టీ దుకాణాలు నడిపే వాళ్ల కష్టాలను రాహుల్ గాంధీ హైలెట్ చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ వీరాభిమానులు రాహుల్ గాంధీ పేరుతో టీ స్టాళ్లు ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరుతున్నారు.

# తెలంగాణలో బీజేపీ బస్సు యాత్ర





## వీరి సారథ్యంలోనే, ఎప్పట్నుంచంటే?

హైదరాబాద్: తెలంగాణలో అధికారమే లక్ష్యంగా బీజేపీ అడుగులో వేస్తోంది. ఇప్పటికే ప్రజల్లోకి వెళ్లేందుకు పలు కార్యక్రమాలను చేపట్టిన బీజేపీ.. ఇప్పుడు మరో కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న క్రమంలో ప్రజా సంగ్రామ యాత్ర తరహాలో బస్సు యాత్రకు బీజేపీ సిద్ధమైంది. సెప్టెంబర్ 17న మొదలు పెట్టి అక్టోబర్ 2న ముగించే విధంగా ఈ బస్సు యాత్రకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఉమ్మడి పది జిల్లాలను 3 క్లస్టర్లుగా విభచించి యాత్ర చేపట్టాలని భావిస్తోంది. ఆదిలాబాద్ నుంచి ఒక బస్సు యాత్ర, గద్వాల నుంచి ఒక బస్సు యాత్ర, భద్రాచలం నుంచి ఒక బస్సు యాత్ర ప్రారంభించేలా ప్లాన్ చేస్తోంది. ఈ మూడు యాత్రలకు రాష్ట్ర పార్టీ కీలక నేతలు సారథ్యం వహించనున్నారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ ఛైర్మన్ ఈటల రాజేందర్ ఒక్కో యాత్రకు నేతృత్వం వహించనున్నారు. ఈ ముగ్గురు నేతల్లో ఎవరూ ఏ క్లస్టర్‌కు నాయకత్వం వహించేది స్పష్టత రావాల్సి ఉంది. పదిహేను రోజుల పాటు జరిగే ఈ యాత్రలో ప్రతి ఒక్క బస్సు యాత్ర ప్రతి రోజూ రెండు అసెంబ్లీ కేంద్రాల్లోకి వెళ్లేలా రాష్ట్ర నాయకత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. యాత్రకు సంబంధించి పార్టీ రాష్ట్ర ఇంచార్జీ, ఎన్నికల కమిటీ సహ ఇంచార్జీ సునీల్ బన్సల్ రాష్ట్ర నాయకత్వానికి పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ప్రజా సంగ్రామ యాత్ర నిర్వహణ బాధ్యత వహించిన వీరేందర్ గౌడ్, దీపక్ రెడ్డి, పాపారావు, విక్రమ్ గౌడ్?లకు బస్సు యాత్ర నిర్వహణ బాధ్యతలను కట్టబెట్టింది. మూడు క్లస్టర్లలో ప్రారంభమయ్యే యాత్రను దీపక్ రెడ్డికి సమన్వయ బాధ్యతలు అప్పగించింది. మరోవైపు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సభలు సమావేశాలు, ర్యాలీలు నిర్వహించేందుకు ప్లాన్ చేస్తోంది.

అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించే సభలకు కేంద్ర మంత్రులు, జాతీయ నాయకులు రానున్నారు. కేసీఆర్ సర్కారు వైఫల్యాలపై ధ్వజమెత్తుతూనే.. ప్రధాని మోడీ సర్కారు చేపట్టిన సంక్షేమ పథకాలు, తెలంగాణకు కేంద్ర సహాయంపై ప్రజలకు వివరించనున్నారు. యాత్రలపేరుతో పార్టీ శ్రేణుల్లో ఉత్తేజం నింపడంతో పాటు ఎన్నికల శంఖారావాన్ని పూరించనుంది.

## సంపాదకీయం

# మోడీ అబద్ధాలు చెప్పారా ?

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నరేంద్ర మోదీ ప్రసంగంలో ఆత్మవిశ్వాసం కనిపించింది. అందుకనే రాబోయే ఆగస్టు 15వ తేదీన కూడా ఎర్రకోటలో తానే ప్రసంగిస్తానని చెప్పారు. ఎర్రకోట నుంచి ప్రసంగించటం అంటే ప్రధానమంత్రిగా ఉండటమే కదా. మళ్ళీ అధికారంలోకి వచ్చే విషయంలో మోడీకి నమ్మకం ఉండచ్చు, మోడీ లెక్కలు మోడీకి ఉండచ్చు. అయితే ఆ సందర్భంగా చెప్పిన అనేక విషయాల్లో కీలకమైనవి అవినీతి, వారసత్వ, బుజ్జగింపు రాజకీయాలను అంతచేస్తామని చెప్పటం. ఈ మూడింటిని ప్రజాస్వామ్యానికి, సమాజానికి పట్టిన చీడ పురుగులుగా మోడీ అభివర్ణించారు. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే ఈ మూడింటిని ఇపుడు మోడీ ప్రభుత్వం బ్రహ్మాండంగా ఆచరిస్తోంది. అవినీతి అంటే డైరెక్టుగా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో నిధులను స్వాహా చేయటమే కానక్కర్లేదు. వేల కోట్ల రూపాయాల ప్రజాధనాన్ని బ్యాంకుల నుండి దోపిడీ చేసిన వాళ్ళని రక్షించటం కూడా అవినీతిని ప్రోత్సహించటమే. బ్యాంకుల నుండి వేల కోట్ల రూపాయలు దోచుకున్న పారిశ్రామికవేత్తలు దేశం వదిలి వెళ్ళిపోవటానికి సహకరించటమూ అవినీతే. నీరవ్ మోడీ, విజయమాల్య, మొహుల్ చోక్సీ లాంటి ఎంతోమంది పారిశ్రామికవేత్తల ముసుగుల్లో వేల కోట్ల రూపాయలు దోచేసుకున్నారు. ఎవరిపైనా ఇంతవరకు చర్యలు లేవు. అలాగే వేల కోట్లరూపాయలు అప్పులు తీసుకుని చెల్లించకపోతే రానిబాకీల ముసుగులో వాటిని రద్దుచేయటం కూడా అవినీతికి కిందకే వస్తుంది. గడచిన తొమ్మిదేళ్ళల్లో మోడీ ప్రభుత్వం రద్దుచేసిన రానిబాకీలు సుమారు రు. 11 లక్షల కోట్లు. ఇక వారసత్వ రాజకీయాల గురించి చెప్పింది కూడా అబద్ధమే. ఎందుకంటే ఎన్డీయే పార్టనర్స్ లోని చాలాపార్టీల అధినేతలు వారసత్వంగా ఉన్నవారే. నేషనల్ పీపుల్స్ పార్టీ అధినేత కోన్రాడ్ సంగ్మా, అప్నాదళ్ అనుప్రియాపటేల్, జన నాయక్ జనతాపార్టీ అధినేత దుష్యంత్ చౌతాలా, లోక్ జనశక్తి పార్టీ అధినేత చిరాగ్ పాశ్వాన్ లాంటి వాళ్ళంతా వారసులుగా వచ్చిన వాళ్ళే. అసలు క్రికెట్ బోర్డు అధ్యక్షుడు జై షా కు ఆ పదవి కేవలం అమిత్ షా వల్లే వచ్చింది. వారసత్వ రాజకీయాలు చేస్తు దానికి వ్యతిరేకమని మోడీ చెబితే ఎవరు నమ్ముతారు ?

# ఆటుపోట్లను అధిగమించి.. ప్రగతి పథంలో..



జనగామ : జనగామ మున్సిపాల్టీ పాలకవర్గం ఏర్పడి మూడేళ్లు పూర్తయింది. నాల్గో వసంతంలోకి అడుగు పెట్టింది. 2020 జనవరి 27న పురపాలక కౌన్సిల్ ప్రమాణ స్వీకారం, తొలి సమావేశం జరిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆశయాలు, లక్ష్యాలను, ప్రజల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకొని పురపాలక వర్గం ముందడుగు వేయాల్సి ఉంది. నిధులు, వనరులు ఉన్నాయి.. ఇక కావాల్సింది చిత్తశుద్ధితో కూడిన పాలనే.ఇదో మైలు రాయి..పురపాలనకు మూడేళ్లు పూర్తి కావడం ముఖ్యమైన మైలు రాయి. చేసింది ఎంత? చేయాల్సింది ఏమిటో సమీక్షించుకునేందుకు ఇదో సందర్భం. పురపాలిక 1953లో ఏర్పడింది. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం అనంతరం తొలి, మలి సారి జనగామ పీఠం మహిళలకే దక్కింది. తొలి ఏడాది పట్టణ ప్రగతితో పాలన పట్టాలెక్కినా, రెండో ఏడాది కరోనా వ్యాప్తితో ఆటుపోట్లు ఎదురయ్యాయి. జిల్లా కేంద్రంగా ఎదిగిన జనగామ పట్టణం ఆ స్థాయిలో అభివృద్ధి సాధించాల్సి ఉంది.

ఇంటింటికీ నల్లాలు..

రూ.20 కోట్ల పట్టణ భగీరథ పథకంలో ఇంటింటికీ నల్లాలు ఇచ్చారు. రోజు తాగునీటి సరఫరా జరుగుతోంది. గోదావరి జలాలను శుద్ధి చేసి నిత్యం 7.50 మిలియన్ల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. ఇందుకు ఏటా రూ.1.50 కోట్ల ఖర్చవుతోంది. ఇంటింటికీ తడి, పొడి చెత్త సేకరణ, నిర్వహణ కోసం రూ.1.50 కోట్లతో డంపింగ్ యార్డును ఏర్పాటు చేశారు. నిర్వహణ లోపాలను సవరించాల్సి ఉంది.. రూ.2 కోట్లతో మానవ వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని నెలకొల్పారు. వరద, మురుగునీటి పారుదల వ్యవస్థలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు మంజూరయ్యాయి. వీధి దీపాల వ్యవస్థ బాగుపడింది.

సుందరీకరణపై దృష్టి

పట్టణ అభివృద్ధి, సుందరీకరణ పనులను రూ.30 కోట్లతో చేపట్టారు. సెంట్రల్ లైటింగ్ దీపాలు వెలుగులు విరజిమ్ముతున్నాయి. విభాగినుల నిర్మాణ పనులు 15 శాతం మిగిలి ఉన్నాయి. నెహ్రూపార్కు–బస్టాండు రహదారి విస్తరణతో ఆ దారికి కొత్త కళ వచ్చింది. మిగిలిన మూడు దారుల్లో 100 అడుగుల రహదారిని వినియోగంలోకి తేవాలి. చౌరస్తా సహా కూడళ్లను సుందరీకరించాలి. రూ.6.50 కోట్ల వ్యయంతో ఆదర్శ మార్కెట్, రూ.కోటితో ఆదర్శ వైకుంఠధామం నిర్మాణ పనులు చేపట్టారు. ఇందులో పూలు, పండ్ల మార్కెట్‌కు కవర్‌షెడ్ వేస్తే బాగుంటుందనే సూచనపై సమీక్షించాల్సి ఉంది. నెహ్రూపార్కు–సాయినగర్ రోడ్డు పనుల పూర్తికి ప్రత్యేక నిధులు సాధించాల్సి ఉంది. బహుళ ప్రయోజన వేడుకల మందిరం, ఆధునిక దోభీఘాట్‌లు ప్రతిపాదన దశలో ఉన్నాయి. జంతు సంరక్షణ కేంద్రం, బృహత్ ప్రకృతివనం, క్రీడా ప్రాంగణాల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. రైల్వే అండర్‌పాస్ తదితర అసంపూర్తి పనులపై దృష్టి సారించాలి.

నాణ్యమైన సేవల వైపు

పౌరసేవలను మెరుగుపర్చేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. సిటిజన్ బడ్డీ యాప్, పౌరసేవా కేంద్రాలు, ఇ–ఆఫీస్ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలి. పురపాలిక నిర్ణయాలు, తీర్మానాల గురించి ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకోవాలి. కొత్త పురచట్టంలో ఎవరి బాధ్యతలు ఏమిటో, ఎవరి వైఫల్యానికి ఎలాంటి చర్యలుంటాయో స్పష్టంగా ఉంది. ఇక పర్యవేక్షక అధికార వ్యవస్థను సమీక్షించి చట్టం అమలుకు అడుగు ముందుకు వేయాల్సి ఉంది.

అందరి సహకారంతో సమగ్రాభివృద్ధి

జమున, ఛైర్‌పర్సన్, జనగామ పురపాలిక

కౌన్సిల్ ఆధ్వర్యంలో అన్ని వర్గాల సహకారంతో మూడేళ్లలో రూ.కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగాయి. మిగిలిన గడువులో ఎమ్మెల్యే సహకారంతో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులను ప్రణాళికా బద్ధంగా చేపడతాం.

# పేరుకుపోతున్న పత్తి .. పడిపోతున్నధర



మహబూబాబాద్ : ఈ ఏడాది ప్రారంభంలో కాసులు కురిపించిన తెల్లబంగారం ఇప్పుడు కన్నీళ్లు పెట్టిస్తోంది. అధిక వర్షాలు, తెగుళ్ల కారణంగా ఆశించిన దిగుబడి రాకున్నా.. మంచి ధర వస్తుందని రైతులు అనుకున్నారు. ఇప్పుడు క్రమంగా పడిపోతున్న ధరలకు పంట విక్రయిస్తే పెట్టుబడులు కూడా వచ్చేలా లేదని ఉమ్మడి జిల్లా దూది రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆశ వదులుకోలే.. అమ్ముకోలేక ఇళ్లల్లో నిల్వ చేసుకుంటున్నారు.

70 శాతం నిల్వలేతెల్లబంగారం ధర పెరుగుదలపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి జిల్లాలో 70 శాతం మంది రైతులు పంటను విక్రయించకుండానే తమ ఇళ్లలోనే నిల్వ చేసుకున్నారు.

వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో ఈసారి 5,69,502 ఎకరాల్లో పత్తి సాగైంది. ఎకరాకు 6 క్వింటాళ్ల దిగుబడి చొప్పున 3,41,701.2 టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. ఇప్పటి వరకు 30 శాతం అంటే 1.20 లక్షల టన్నుల పత్తిని మాత్రమే రైతులు విక్రయించినట్లు వ్యాపారులు చెబుతున్నారు. రైతుల ఇళ్లలో 2,21,701.2 టన్నుల నిల్వ ఉన్నట్లు లెక్క.

కౌలు రైతుల పరిస్థితి దయనీయం

ఉమ్మడి జిల్లాలో సుమారు 8 లక్షల మంది రైతులు ఉండగా అందులో సుమారు 4.50 లక్షల మంది కౌలు రైతులున్నారు. వీరిలో పత్తి సాగు చేస్తున్నరైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. కౌలు, విత్తనాలు, ఎరువులు, డీజిల్ ధరలు పెరగడంతో అవి భారంగా పరిణమించాయి. ఇప్పుడు చేతికొచ్చిన పంటను విక్రయించి ఆ భారాన్ని తగ్గించుకొని ఎంతో కొంత లాభాన్ని పొందాలని ఆశించారు. విపణిలో పత్తికి పడిపోతున్న ధరలతో పంటకు తెచ్చిన పెట్టుబడి, పెరుగుతున్న వడ్డీ మరింత భారంగా మారిందని విచారం వ్యక్తం చేస్తున్నారు.

ధరల పతనం ఇలా

19 సెప్టెంబరు 2022న క్వింటాకు రూ.8600 పలికిన కొత్త పత్తి ధర అక్టోబరు మాసంలో స్థిరంగా ఉంది. 16 నవంబరు 2022న క్వింటాకు రూ.9015 పలికింది. దాంతో 2021 డిసెంబరులో క్వింటాకు రూ.10 వేల ధర వచ్చినట్లు ఈసారి కూడా పెరుగుతుందని ఆశించిన పత్తి రైతులకు నిరాశే మిగిలింది. గత డిసెంబరు నుంచి ధర పతనమవుతూ వచ్చింది. క్వింటాకు రూ.8వేల నుంచి రూ.7690కి పడిపోయింది.

వ్యాపారులది నిరాశే

కేంద్రం విదేశాల నుంచి దిగుమతులకు అనుమతించడంతో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా నుంచి అధిక సంఖ్యలో క్యాండీ(3.56 క్వింటాళ్ల పత్తి)లను దిగుమతి అవుతున్నాయి. దాంతో ధర పతనానికి కారణం అవుతుందని వ్యాపారులు చెబుతున్నారు. మొదట్లో ఒక్కో క్యాండీ రూ.70 వేలు పలకడంతో క్వింటా పత్తిని రూ. 9 వేల నుంచి రూ.8600లకు కొనుగోలు చేశామని..ఇప్పుడు క్యాండీ ధర రూ.60 వేల నుంచి రూ.65 వేలు పలుకుతుందని వ్యాపారులు చెబుతున్నారు. ఆ కారణంగానే విపణిలో పత్తి ధరలు కూడా తగ్గించి కొనుగోలు చేస్తున్నారని ఒక వ్యాపారి తెలిపారు. దీని వల్ల రైతులు, వ్యాపారులకు నష్టమే మిగులుతోంది. ధరల పతనంతో ఉమ్మడి జిల్లాలో ఉన్న 58 జిన్నింగ్ మిల్లుల్లో ఇప్పటి వరకు రూ. కోట్లు విలువ చేసే సుమారు 1.20 లక్షల బేళ్లు నిల్వ ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

బస్తాలో నిల్వ చేసిన పత్తిని చూపిస్తున్న ఈ రైతు మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల గ్రామానికి చెందిన దయ్యాల యాకన్న. రెండెకరాలు కౌలు తీసుకొని పత్తి సాగు చేశారు. కౌలు ఎకరానికి రూ. 18 వేల చొప్పున రూ.36 వేలు, పంటకు పెట్టుబడిగా రూ.70 వేలు మొత్తంగా రూ.1.06 వేలు ఖర్చు చేశాడు. అందులో వచ్చిన 12 క్వింటాళ్ల పత్తిని ఇంట్లోనే నిల్వ చేశారు. కారణం నవంబర్‌లో క్వింటాకు రూ. 9 వేలు పలకడంతో అది కాస్త రూ.10 వేలు అవుతుందని ఆశించి నిల్వ చేశారు. ఇప్పుడు పడిపోతున్న ధరతో పంటను విక్రయిస్తే పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చేతిలో కర్రపట్టుకొని ఇంట్లో నిల్వ చేసిన పత్తిని చూపిస్తున్న ఈ రైతు నెల్లికుదురు మండలం రామన్నగూడెనికి చెందిన కాశమల్ల వెంకన్న. నాలుగున్నర ఎకరాల్లో పత్తిసాగు చేశారు. ఇందులో మూడున్నర ఎకరాలు కౌలు తీసుకున్నారు. కౌలు, పంట పెట్టుబడిగా రూ.1.57 లక్షలు అయింది. చేతికొచ్చిన 25 క్వింటాళ్ల పత్తిని ఇంట్లోనే నిల్వ చేశారు. ప్రస్తుతం ధర పడిపోవడంతో ఆందోళనకు గురైన వెంకన్నకు ఇటీవల కడుపు నొప్పి రావడంతో శస్త్రచికిత్స చేయించుకున్నారు. అందుకు రూ.70 వేలు ఖర్చు అయింది. తన కూతురు ప్రసవం కావడంతో రూ.20 వేలు వ్యయం చేశారు. మొత్తంగా రూ.లక్షను తెలిసినవారి నుంచి ఇంట్లోని పత్తిని చూపించి అప్పు చేశారు. పంటకు, ఇంటి అవసరాలకు తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతుండడంతో ధర లేకున్నా రెండు, మూడు రోజుల్లో పత్తిని విక్రయిస్తానని రైతు వెంకన్న విచారం వ్యక్తం చేస్తున్నారు.

ఇంట్లో నిల్వ చేసిన 12 క్వింటాళ్ల పత్తిని చూపిస్తున్న నెల్లికుదురుకు చెందిన పోతుగంటి శ్రీనివాస్. రెండెకరాల్లో పత్తి సాగు చేశారు. రూ.70 వేలు ఖర్చు పెట్టారు. ధర రూ.10 వేల నుంచి రూ.12 వేలు ఉంటే విక్రయించాలని అనుకున్నారు. ధరలు లేకపోవడంతో ఇంట్లోనే పెట్టాడు. రూ.30 వేల విలువైన ఎరువులు, పురుగు మందులను ఉద్దెర తెచ్చారు. వాటిని చెల్లించాలని వ్యాపారి ఒత్తిడి చేస్తున్నారు.

# సదర్‌మాట్ బ్యారేజీపైనే ఆశలు!

ఇబ్రహీంపట్నం : గోదావరి నదిలో వృథాగా పోతున్న జలాలను బీడు భూములకు తరలించాలన్న ఉద్దేశంతో నిర్మించ తలపెట్టిన సదర్‌మాట్ బ్యారేజీ పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. దీంతో పాటు గంగనాల ప్రాజెక్టు కాలువలకు రీడిజైనింగ్ పనులు చేపడితే మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల్లోని వేలాది ఎకరాల బీడు భూములకు సాగునీరు అందనుంది. ప్రస్తుతం ఉన్న కాలువలు సామర్థ్యం తక్కువగా ఉండటంతో సాగునీరు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పలు గ్రామాల్లో వ్యవసాయ భూములు నిరుపయోగంగా మారుతున్నాయి. గత ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో మరమ్మతులు జరుపడానికి అవసరమైన నిధులను మంజూరు చేయకపోవడంతో వేల ఎకరాలు భూములు బీళ్లుగా మారాయి. ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్, నిర్మల్ జిల్లా పొన్కల్ గ్రామాల సరిహద్దులోని గోదావరి నదిపై ఆనకట్ట నిర్మించి గంగనాల ప్రాజెక్టు ద్వారా ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల్లోని 8 గ్రామాలకు సాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో ఏడు సంవత్సరాల క్రితం రూ.531 కోట్లను తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో చేపట్టిన పనులను సకాలంలో గుత్తేదారు పూర్తిచేయకపోవడంతో కొనసాగుతున్నాయి. దీనికి తోడు మొగిలిపేట పెద్దచెరువుకు సాగునీటిని అందించే కాలువలో సిమెంట్ లైనింగ్ చేపట్టకపోవడం, పెద్దచెరువును రిజర్వాయర్‌గా మార్చకపోవడం వంటి పనులతో బీడు భూములకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. ఇబ్రహీంపట్నం మండలంలోని ఫకీర్ కొండాపూర్, తిమ్మాపూర్ గ్రామాలతో పాటు మల్లాపూర్ మండలంలోని నడికుడ, మొగిలిపేట, సంగెం, శ్రీరాంపూర్, కొత్తదాంరాజుపల్లి, ఒబులాపూర్ గ్రామాల్లోని 4 వేల ఎకరాల భూములకు సాగునీరు రాని పరిస్థితులున్నాయి.

ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే 1.58 టీఎంసీల నిల్వ

సదర్‌మట్ బ్యారేజీ నిర్మాణానికి 2016 నవంబర్‌లో శంకుస్థాపన చేశారు.

# స్వచ్ఛతకు మరో అడుగు

సిరిసిల్ల : స్వచ్ఛభారత్‌లో జిల్లా మరో ముందడుగుకు సిద్ధమవుతోంది. 2017 జనవరిలో జిల్లాను ఓడీఎఫ్‌గా తర్వాత 2022 డిసెంబరులో ఓడీఎఫ్ ప్లస్ స్థానానికి చేరుకుంది. ఓడీఎఫ్ ప్లస్ ప్లస్‌కు చేరాలంటే గ్రామాల్లోని మరుగుదొడ్ల వినియోగం, నిర్వహణ సక్రమంగా జరగాలి. దీని కోసం ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎఫ్ఎస్‌టీపీ)లు అవసరం. వీటి నిర్మాణానికి రూ.లక్షల్లో నిధులు అవసరం. సిరిసిల్ల పురపాలికలోని ఎఫ్ఎస్‌టీపీని పంచాయతీలకు వినియోగించుకునేలా జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్నారు. ఇది విజయవంతమైతే ఎన్ఎఫ్ఎస్ఎస్ఎం (నేషనల్ ఫీకల్ స్లడ్జ్ సెప్టేజ్ మేనేజ్‌మెంట్) పాలసీతో జిల్లాకు ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ జాబితాలో చేరుతుంది.దేశవ్యాప్తంగా స్వచ్ఛభారత్‌లో స్వచ్ఛత కార్యక్రమాలను ఒక్కొక్కటిగా పూర్తి చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం ద్రవ వ్యర్థాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించి ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ స్థానానికి యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే సిరిసిల్ల పురపాలికలో ఈ ప్రక్రియను చేపడుతున్నారు. 2030 నాటికి దేశంలో మెజారిటీ పల్లెలు ఇందులోకి తీసుకొచ్చేందుకు కేంద్రం ఎన్ఎఫ్ఎస్ఎస్ఎం పాలసీని తీసుకొచ్చింది. స్వచ్ఛభారత్‌లో నిర్మించుకున్న మరుగుదొడ్ల నిర్వహణ లేదు. ఒకవేళ వీటిని శుభ్రం చేసుకునే సమయంలో వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పారబోస్తున్నారు. ఇలా చేయడం వల్ల అక్కడి ప్రాంతం కలుషితంతోపాటు వ్యాధుల వ్యాప్తికి కారణమవుతున్నారు. దీనిని ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలనేది ఎన్ఎఫ్ఎస్ఎస్ఎం ముఖ్య ఉద్దేశం.

పంచాయతీల్లో అవగాహనకు...జిల్లాలోని పంచాయతీల్లో ద్రవ వ్యర్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమాలకు యంత్రాంగం సమాయత్తమవుతోంది. వాస్తవానికి ప్రతి మూడేళ్లకోసారి మరుగుదొడ్ల ట్యాంకులను శుభ్రం చేసుకోవాలి. కానీ ఏళ్ల తరబడి అలానే ఉంచుతున్నారు. 2011 లెక్కల ప్రకారం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 1.38 లక్షల గృహాలున్నాయి. వీటిలో 1.07 లక్షల మరుగుదొడ్ల నిర్మాణం జరిగింది. వీటిలో నిర్వహించాల్సినవి సుమారు 40 వేల వరకు ఉంటాయని అంచనా. వీటిపై పూర్తిస్థాయిలో లెక్కలు తీయాల్సి ఉంది. సిరిసిల్ల పురపాలికలో 2019 నుంచి ఎఫ్ఎస్‌టీపీ వినియోగంలోకి వచ్చింది. పట్టణంలో ద్రవ వ్యర్థాల సేకరణకు వాహనాల రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేశారు. పురపాలికలో రూ.పది వేలు డిపాజిట్ చేసిన వారికే తరలించేందుకు అనుమతినిచ్చారు. ఇలా నమోదు చేసుకున్న వాహనాలకు వ్యర్థాల తరలింపులో ఒక ట్యాంకుకు రూ.1500లుగా ధర నిర్ణయించారు. దీని కోసం పురపాలికలో ప్రత్యేకంగా కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. తొలుత ఆరు వాహనాలు నమోదు చేసుకోగా ప్రస్తుతం రెండు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం ఇదే పద్ధతిని పంచాయతీల్లో అమలు చేసేలా ప్రణాళికలు చేస్తున్నారు. కాకపోతే పంచాయతీల నుంచి సిరిసిల్ల దూరాన్ని బట్టి ధరను నిర్ణయిస్తారు. తర్వాత దశల వారీగా మండలానికి ఒక ఎఫ్ఎస్‌టీపీని నిర్ణయించేలా ప్రభుత్వం ప్రణాళికలు చేస్తోంది.

ద్రవ వ్యర్థాల వాహనాల తరలింపు వాహనాల కొరత ఉండటంతో సిరిసిల్ల పురపాలికలో మహిళా సంఘాలకు ఎన్ఎస్‌కెఎఫ్‌డిసీ (నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) కింద రుణాలు ఇస్తున్నారు. దీనికి రెండు సంఘాలు ముందుకొచ్చాయి. త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తి చేస్తారు. దీంతో వాహనాల సంఖ్య పెరుగుతుంది. ఎఫ్ఎస్‌టీపీ సామర్థ్యం..సిరిసిల్ల పురపాలికలోని ఎఫ్ఎస్‌టీపీ రోజుకు 18 కిలోలీటర్లు. కాగా దీనిని 9 కేఎల్‌డీలతో రెండు యూనిట్లుగా చేశారు. అంటే రోజుకు సగటున 12 వాహనాల ద్రవ వ్యర్థాలు వచ్చినా నిల్వ చేసే సామర్థ్యం ఉంది. ఇందులో ఒకసారి వ్యర్థాలను నింపాక 34 రోజుల్లో ఎరువుగా తయారవుతుంది. వీటిలోని వ్యర్థ జలాలతో పురపాలిక చెత్తసేకరణ ట్రాక్టర్లను శుభ్రం చేయడం, పూలచెట్ల సంరక్షణకు వినియోగిస్తున్నారు. సేంద్రియ ఎరువును కిలోకు రూ.10 చొప్పున విక్రయించడంతోపాటు పురపాలికల్లో నాటిన మొక్కలకు ఎరువుగా కూడా వాడుతున్నారు.

# త్వరలో అతివలకు భరోసా కేంద్రం

కరీంనగర్ : ఎన్ని చట్టాలున్నా మహిళలపై అఘాయిత్యాలు, దారుణాలు జరుగుతూనే ఉన్నాయి. అలాంటి ఘటనల్లో బాధితులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర పోలీసు శాఖ 'భరోసా' కల్పించడానికి అన్ని వసతులతో కూడిన శాశ్వత భవనాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. 2016లో హైదరాబాద్‌లో ఏర్పాటు చేయగా.. సత్ఫలితాలు ఇవ్వడంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలనుకున్నారు. మొదటి దశలో 12 కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, అందులో ఒకటి ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఉంది. కేంద్రం భవన నిర్మాణ పనుల పురోగతిపై కథనం.

ఎకరం స్థలంలో.. రూ.1.70 కోట్లతో..గతేడాది డిసెంబరు 17న రాష్ట్ర ప్రభుత్వం రూ.1.70 కోట్ల నిధులను మంజూరు చేసింది. కొత్తపల్లి సమీపంలో ఎకరం స్థలంలో నిర్మిస్తున్న ఈ జీం1 భవన నిర్మాణానికి రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ శంకుస్థాపన చేశారు. దీన్ని ఆరు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది అందుబాటులోకి వస్తే మహిళలు, పిల్లలపై వేధింపులు, హింసాత్మక ఘటనలు జరిగినప్పుడు బాధితులకు భరోసా కేంద్రం రక్షణ కల్పించడంతోపాటు చేయూత ఇవ్వనుంది.

నాలుగైదు నెలల్లో పూర్తి?లైంగిక వేధింపులు గురైన మహిళలు, మైనర్లు, పోక్సో కేసులలో బాధితులకు అన్ని విధాలా రక్షణ కల్పించడానికి 'వన్ స్టాప్ సెంటర్' అన్ని హంగులతో కింద భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నాలుగేళ్ల క్రితం ఈ ప్రతిపాదనలు చేసినా ఆచరణలో సాధ్యం కాలేదు. అయితే గతేడాది డిసెంబరు 17న ఈ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన జరగ్గా..నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మరో నాలుగైదు నెలల్లో పూర్తయ్యే అవకాశముంది. రాష్ట్రవ్యాప్తంగా ఏడు భరోసా కేంద్రాలు.. ప్రభుత్వ కార్యాలయాలు, అద్దె భవనాల్లో కార్యకలాపాలు కొనసాగుతుండగా.. కరీంనగర్‌లో నిర్మించే భవనం అందుబాటులోకి వస్తే ఉమ్మడి జిల్లాలో పక్కా భవనం కలిగిన తొలి భరోసా కేంద్రంగా కానుంది.

అందుబాటులోకి వచ్చే సేవలు

ఈ భవనం పోలీస్ శాఖ పర్యవేక్షణలో నడవనుంది. ఈ కేంద్రం మహిళలు, బాలికలు, పోక్సో కేసుల్లో బాధితులుగా ఉన్న వారికి మనోధైర్యంతోపాటు భరోసా కల్పించనుంది. కౌన్సెలింగ్ చేయడంతోపాటు ప్రభుత్వపరంగా రావాల్సిన పరిహారం అందేలా కృషి చేస్తుంది. బాధితులకు అవసరమైన వైద్య, న్యాయ సేవలు, జీవనభృతి అందేలా చేస్తుంది. పోలీస్ స్టేషన్‌కు రావడానికి ఇబ్బందిగా భావించే బాధితులు ఈ కేంద్రాన్ని ఆశ్రయించి న్యాయం పొందవచ్చు. వేధింపులకు గురయ్యే మహిళలకు న్యాయం చేయడానికి ఉన్న సఖీ కేంద్రానికి అదనంగా భరోసా కేంద్రాలు రానున్నాయి. మానసిక సాంత్వన, పోలీస్, ప్రాసిక్యూషన్, వైద్య, న్యాయ సేవలు, పునరావాసం, ఆశ్రయ కల్పన, ఉపాధి కల్పించడం వంటి సేవలు ఒకే చోట అందిస్తారు. పోలీస్ శాఖలో ఉన్న మహిళా అధికారులతోపాటు కౌన్సెలర్, న్యాయవాది, వైద్య సిబ్బంది, నిర్వాహక సిబ్బందిని ఇలా ఒప్పంద ప్రాతిపదికన 15 మంది మహిళలను నియమించనున్నారు.

# మొక్కమొక్కకూ లెక్క

పాల్వంచ : పల్లెలతో పాటు పట్టణ ప్రాంతాలనూ పచ్చందాల నెలవులుగా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'హరితహారం' కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తోంది. ఈ ఏడాది తొమ్మిదో విడత కింద మొక్కలు నాటేందుకు, పంపిణీ చేసేందుకు పురపాలికల వారీగా కార్యాచరణ రూపొందించారు. జియో ట్యాగింగ్ చేయాల్సిందే

కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు పురపాలికల్లో ఈ ఏడాది 5,89,800 మొక్కలు నాటాల్సి ఉంది. నాటిన ప్రతి మొక్కను 'జియో ట్యాంగింగ్' చేయాలని స్థానిక అధికారులకు శాఖాపరమైన ఆదేశాలందాయి. ఇప్పటికే ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీ చేస్తున్నారు. గుంతలు తీసి నాటేందుకు బల్దియా సిబ్బంది సన్నద్ధమవుతున్నారు. 'దశాబ్ది' పేరిట ప్రతి మున్సిపాలిటీలో 1,000 చొప్పున ఒకేరోజు నాటేలా తాజాగా ఏర్పాట్లు చేస్తున్నారు. గతేడాది నాటిన వాటిల్లో



ఏమైనా చనిపోయినట్లయితే మళ్లీ అక్కడ కొత్తవి వేయనున్నారు. సెప్టెంబరు చివరి నాటికి హరితహారం మొత్తం ప్రక్రియ ముగించాలని కలెక్టర్లు, పురపాలక శాఖ ఉన్నతాధికారులు ఆదేశాల్లో పేర్కొన్నారు. హరితహారం మొక్కలు నాటే ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక తాజాగా ఆదేశాలిచ్చారు. ప్రస్తుతం ఇంటింటికీ మొక్కల పంపిణీ జరుగుతోంది. వర్షాకాలం సీజన్ ముగిసే లోగా లక్ష్యాన్ని పూర్తిచేస్తాం. నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతనూ తీసుకుంటున్నాం. స్వామి, పాల్వంచ పుర కమిషనర్

# గిరిజనుల వెతలు పట్టవా..?

జనగామ : జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖకు కనీసం కార్యాలయం లేక వెతలు చెప్పుకునే వేదిక లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలను ఒకే దగ్గర కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖలు వారి వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నాయి. ఎస్టీ సంక్షేమ శాఖకు కార్యాలయం లేక ఒక్క అధికారి కూడా అందుబాటులో లేకపోవడంతో గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పక్క జిల్లాకు పోవాల్సిందే..

జిల్లా ఏర్పడి ఐదేళ్లయినా ఇక్కడి గిరిజనులకు వెతలు తప్పడం లేదు. గతంలో కార్యాలయం కరవై ఇబ్బందులు పడిన ప్రజలకు..ఇప్పుడు అధికారి కరవయ్యారు. హనుమకొండ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారినే ఈ జిల్లాకు కూడా ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. జిల్లా స్థాయి సమావేశాలకు మాత్రమే సదరు అధికారి కలెక్టరేట్‌కు వచ్చి వెళ్తుంటారు. శాశ్వత అధికారి అందుబాటులో లేకపోవడంతో సమస్యలు చెప్పుకోవాలన్నా, అర్జీ అందించాలన్నా హనుమకొండ జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోంది. తక్కువ జనాభా కలిగిన మైనారిటీ శాఖకు అధికారి ఉండగా 60 వేల వరకు ఉన్న గిరిజనుల సమస్యలను తెలుసుకునేందుకు అధికారి అందుబాటులో లేకపోవడం ఏమిటని పలువురు మండి పడుతున్నారు. ప్రజల వద్దకే పాలన అని పాలకులు చెబుతున్నారే తప్పా గిరిజనుల గోడు వినే నాథుడే కరవయ్యారు.

జూనియర్ అసిస్టెంటైనా ఉండాలి

స్థానికంగా గిరిజన అధికారి లేక పోవడం, అవగాహన లేకపోవడం వల్ల ప్రభుత్వం అందించే పథకాలకు ఈ ప్రాంత గిరిజనులు దూరమవుతున్నారు. గిరిజనులకు సంబంధించిన విషయాలపె కలెక్టర్ ప్రకటన రూపంలో తెలియజేస్తున్నా అవి క్షేత్రస్థాయిల తండాల్లోని




ప్రజలకు చేకూరడం లేదు. ఇటీవల బెస్ట్ అవైలబుల్ స్కీం, గిరిజనులకు ఉచిత శిక్షణ, తదితర ప్రకటనలు జారీ చేసినప్పటికీ దరఖాస్తులు సమర్పించేందుకు హనుమకొండలోని గిరిజన కార్యాలయానికి వెళ్లాలని సూచిస్తున్నారు. కనీసం ఒక్క జూనియర్ అసిస్టెంట్ స్థాయి అధికారినైనా జిల్లా కలెక్టరేట్‌లో నియమిస్తే ఉపయోగంగా ఉంటుందని గిరిజనం కోరుతున్నారు.

గోడు పట్టదా: శంకర్

జిల్లాలో గిరిజన శాఖకు సంబంధించి ఒక్క అధికారి కూడా అందుబాటులో లేకపోవడంతో మా గిరిజనులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఏ చిన్న సమస్య ఉన్నా పక్క జిల్లా హనుమకొండకు వెళ్లాల్సి వస్తోంది. నిరుపేదలైన గిరిజనులు అంత దూరం వెళ్లాలంటే ప్రయాణపు ఛార్జీలు భారంగా ఉన్నాయి. ముఖ్యంగా వృద్ధులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అన్ని శాఖలతో పాటు గిరిజన శాఖను కూడా కలెక్టరేట్‌లో కొనసాగించేలా జిల్లా ఉన్నతాధికారులు కృషిచేయాలి.

ఒకరినైనా నియమించాలి-అనిల్ చౌహాన్, సేవాలాల్ విద్యార్థి సేన జిల్లా కార్యదర్శి

జిల్లాలో అధికారి లేకపోవడంతో విద్యార్థులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. గిరిజన విద్యార్థులకు సంబంధించిన ఉపకార వేతనాల కోసం పొరుగు జిల్లాకు వెళ్లాల్సి వస్తోంది. దరఖాస్తు ప్రక్రియలో ఏ చిన్న తప్పిదం జరిగినా మళ్లీ అంతదూరం వెళ్లక తప్పడం లేదు. స్థానికంగా ఉన్న గిరిజనులకు సంబంధించిన వ్యవహారాలను చూసుకునేందుకు కనీసం జూనియర్ అసిస్టెంట్ స్థాయికి చెందిన అధికారిని నియమిస్తే బాగుంటుందని నా అభిప్రాయం.

# చదువుపై పట్టు... అవసరాలు తీర్చేట్టు




భద్రాచలం : భావి అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో 'మైండ్ స్పార్క్ ఫ్యూచర్ ఇంజినీర్' కార్యక్రమం అమలుకు ప్రభుత్వం పూనుకుంది. దీనిద్వారా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో 10వేల మంది గిరిజన విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది. కంప్యూటర్ సాయంతో విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు మెరుగుపరుస్తారు. పోటీ ప్రపంచంలో రాణించేలా ఆలోచన శక్తిని పెంపొందించనున్నారు. చదువులపరంగా నూతన కాంతిని తీసుకురావడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని ఐటీడీఏ అధికారులు చెబుతున్నారు. మైండ్ స్పార్క్ ఫ్యూచర్ ఇంజినీర్ కార్యక్రమానికి భద్రాద్రి జిల్లాలో 14, ఖమ్మం జిల్లాలో మూడు పాఠశాలలు ఎంపికయ్యాయి. వీటిలో భద్రాద్రి జిల్లాలో రెండు, ఖమ్మం జిల్లాలో ఒక గురుకుల విద్యాలయాలు ఉండగా మిగతావి గిరిజన ఆశ్రమ పాఠశాలలు కావటం విశేషం.

నాలుగు తరగతులకు..

ఆరోతరగతి నుంచి తొమ్మిదోతరగతి విద్యార్థులకు గణితం, ఇంగ్లిష్,సైన్స్‌పై కంప్యూటర్ల సాయంతో నిపుణులు బోధించటం ఈ కార్యక్రమం ప్రత్యేకత. అమెజాన్ సంస్థ ఇందుకు సహకరిస్తుంది. ఉట్నూరు ఐటీడీఏ పరిధిలో38, ఏటూరునాగారం- 17, భద్రాచలం- 17, మైదాన ప్రాంతంలో 40 పాఠశాలలు ఎంపికయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 'మైండ్ స్పార్క్' అమలుకానుంది. ఈనెలలోనే బోధన మొదలవుతుంది.

గణితంలో రాటుదేలాలని..

గడిచిన విద్యా సంవత్సరంలో పదోతరగతి వార్షిక పరీక్షల ఫలితాలను పరిశీలిస్తే ఎక్కువ మంది లెక్కల్లో తప్పారు. సిలబస్‌కు మించి ప్రశ్నలు వచ్చాయని, సాధన చేసినవి పరీక్షల్లో రాలేదని ఉపాధ్యాయులు భిన్నవాదనలు వినిపించారు. వీటిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. గణితం సబ్జెక్టులో ఎలాంటి ప్రశ్నలు వచ్చినా విద్యార్థులు సమాధానం రాయగలిగేలా కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు వివరించనున్నారు. గణితం ఉపాధ్యాయులు ఈదిశగా కార్యాచరణ చేపట్టేందుకు వీలుగా ఇటీవల ఐటీడీఏలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. రోజూ వీలైన పీరియడ్‌లో ప్రతి విద్యార్థి.. ల్యాబ్‌లోని కంప్యూటర్‌ను వినియోగించనున్నారు. ప్రతి ఒక్కరికీ ప్రత్యేక పాస్‌వర్డ్ ఉండటం వల్ల ఎవరు సాధన చేస్తున్నారో అధికారులు సులువుగా తెలుసుకోవచ్చు. ఇంగ్లిష్ మీడియం అమల్లో ఉన్నందున ఆంగ్లంపైనా తర్ఫీదు ఇస్తారు. సైన్స్‌లో వెనుకబడకుండా తీర్చిదిద్దనున్నారు. ఆన్‌లైన్ సదుపాయం ఉండటంతో కొత్త ప్రశ్నలతో పాటు పాఠ్యాంశాలపై పట్టు సాధించేలా శిక్షణ ఇవ్వనున్నారు.

ఐటీడీఓ పీఓ ప్రత్యేక దృష్టి

పీఓగా ప్రతీక్ జైన్ గతనెలలో బాధ్యతలు స్వీకరించాక గిరిజన విద్యపై ప్రత్యేక దృష్టి సారించారు. ఉదయం 9.30 గంటల వరకు ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు హాజరు పట్టికలో సంతకం చేయకపోతే కారణాలను అడిగి తెలుసుకుంటున్నారు. గుండాల మండలంలోని ఓ పాఠశాలను పీఓ ఇటీవల పరిశీలించగా.. ఆరోజు సెలవు ఉందని ఉపాధ్యాయులు పనిచేసేచోట లేరు. 17 మందికి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. పదోతరగతి వార్షిక పరీక్షల ఫలితాలు తగ్గినచోట్ల 48 మందికి శ్రీముఖాలు ఇచ్చారు. సుమారు 20 మందిని పట్టణ ప్రాంతాల నుంచి మారుమూల పల్లెలకు సాగనంపారు.

# కొంత మంది రైతులకే ఆమోద ముద్ర!




ఖమ్మం : పాడి రైతులకు బ్యాంకుల ద్వారా 'ముద్ర' రుణాలు సకాలంలో అందకపోవటంతో ఇబ్బంది పడుతున్నారు. మూడు నెలలుగా ఈ పథకం నత్తనడకగా సాగుతోంది. ప్రభుత్వరంగ సంస్థ విజయ డెయిరీ, డెయిరీకి పాలు పోసే రైతు, ఎస్‌బీఐ మధ్య త్రైపాక్షిక ఒప్పందంలో భాగంగా మూడు నెలల కిందట పాడి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఉభయ జిల్లాల్లో డెయిరీకి పాలుపోసే అనేక మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు అతికొద్ది మందికి మాత్రమే రుణాలు మంజూరయ్యాయి. వందలామంది రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. పాల దిగుబడికి ఇదే మంచి సీజన్. ఈ సమయంలో రుణాలు మంజూరు చేస్తేనే రైతులకు ప్రయోజనం కలుగుతుంది.పాల ఉత్పత్తి పెంచేందుకు.. పాల ఉత్పత్తి పెంచేందుకు గేదెల కొనుగోలు కోసం విరివిగా రుణాలు ఇప్పించాలని భావించారు. పాల బిల్లులు డెయిరీ చెల్లిస్తున్నందున బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించి ప్రతినెలా ఈఎంఐ చెల్లించేలా ఏర్పాట్లు చేశారు. గేదెల కొనుగోలుకు రూ.50 వేలు- రూ.10 లక్షల వరకు ఎస్‌బీఐ రుణాలు మంజూరు చేస్తుంది. ఇప్పటివరకు చూస్తే ఇచ్చిన రుణాలు చాలా తక్కువ. కొంతమందికి చెక్కులు ఇచ్చారు. ఖమ్మం జిల్లాలోని ఒక్క తల్లాడ మండలంలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ములకలపల్లి, టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో మాత్రమే మంజూరు చేశారు.

రుణాలను సకాలంలో పాడి రైతులకు అందించేందుకు కృషి చేస్తున్నాం. దరఖాస్తుదారుల్లో కొంతమంది డిఫాల్టర్లు ఉండటం, మరికొందరికి ఇతర ధ్రువపత్రాలు లేకపోవటం వల్ల బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నాయి. అర్హులైన వారికి మాత్రం అవకాశం కల్పించేందుకు బ్యాంకు అధికారులతో మాట్లాడతాం. డాక్టర్ ఎ.కుమారస్వామి, ఉప సంచాలకుడు, విజయ డెయిరీ

# అంతిమ సంస్కారానికి అంతులేని కష్టాలు



కరీమాబాద్ : శ్మశానవాటికలను స్మృతివనాలుగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు. సీఎం ప్రత్యేక నిధులు రూ.కోటి మంజూరైనా ఆ శ్మశానవాటికకు మురుగు నీటిలో నుంచే వెళ్లాల్సి వస్తోంది. వరంగల్ నగరంలోని 33వ డివిజన్ ఎస్ఆర్ఆర్‌తోట కరీమాబాద్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పక్కన మూడెకరాల విస్తీర్ణంలో ఉన్న శాంతినగర్ శ్మశానవాటికలో ఏళ్ల తరబడి మౌలిక సదుపాయాలు లేవు. ప్రధాన రోడ్డుకు పక్కనే ఉన్నా.. కనీసం రోడ్డు కూడా సరిగాలేదు. శ్మశానవాటిక ప్రధాన గేటు నుంచి లోపలి వరకు దారంతా మురుగు నీరు నిలిచి ఉంది. కీర్తి బార్ నుంచి వచ్చే మురుగు నీరు శ్మశానవాటిలోకి రాకుండా నివారించడంలో బల్దియా అధికారులు విఫలమవుతున్నారు. దీంతో శాంతినగర్, పెరుకవాడ, రైల్వేగేటు, ఎస్ఆర్ఆర్‌తోట, సాకరాశికుంట తదితర ప్రాంతాల్లో ఎవరైనా మరణిస్తే ఈ శ్మశానవాటికలోనే అంత్యక్రియలు నిర్వహిస్తుంటారు. పార్థివ దేహాలను దుర్గంధం వెదజల్లుతున్న మురుగు నీటిలో నుంచే తీసుకెళ్తున్నారు. నగర నడిబొడ్డున ఉన్న శ్మశానవాటికను ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.కోటి నిధులొస్తే రూ.30 లక్షల పనులే..

శాంతినగర్ హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి 2017లో అప్పటి ఎమ్మెల్యే కొండా సురేఖ ముఖ్యమంత్రి ప్రత్యేక నిధుల నుంచి రూ.కోటి మంజూరు చేయించారు. అయితే అందులో కేవలం రూ.30 లక్షలతో ప్రహరీ, నాలుగు బర్నింగ్ ప్లాట్ఫాంలు నిర్మించారు. ఇంకా సీసీరోడ్డు నిర్మాణం, కమ్యూనిటీ హాల్, షెడ్డు, పార్కు ఏర్పాటు పనులు గుత్తేదారు వదిలేశారు. దీంతో మిగిలిన రూ.70 లక్షల నిధులు వెనక్కి వెళ్లాయి. తర్వాత ఎవరూ పట్టించుకోకపోవడంతో శ్మశాన వాటిక పరిస్థితి అధ్వానంగా మారింది.

ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు- ముత్తినేని శ్రీనివాస్, పెరుకవాడ శ్మశానవాటికలోకి మురుగు వస్తుండటంతో ఎవరైనా మృతి చెందితే అంత్యక్రియలకు తీసుకెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నిధులున్నా పనులు చేయకపోవడం సరికాదు. ప్రధాన గేటు వద్ద మురుగు నీరు రాకుండా అరికట్టాలి. దారికి ఇరువైపులా పెరిగిన చెట్లు కొట్టించి, రాత్రివేళ దీపాలు వెలిగేలా ఏర్పాటు చేయాలి. పాలకులు స్పందించి వెనక్కి పోయిన నిధులు తెప్పించి అభివృద్ధి పనులు చేపట్టాలి.

# వంటలెలా ఉంటున్నాయి..!

జనగామ : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఆహారం శుచి, శుభ్రతగా ఉండేలా జిల్లా పాలనాధికారి ప్రత్యేక దృష్టి సారించారు. వానాకాలంలో అనారోగ్య సమస్యలు ఎదురవకుండా వంటల తయారీలో జాగ్రత్త వహించేలా చూస్తున్నారు. ఏం వండిపెడ్తున్నారు.. ఎలా వండుతున్నారు.. తదితర వివరాలు సేకరణకు అప్పటికప్పుడు ఫొటోలు తీసి పంపాలని ఆదేశించారు. గత ఏడాది పలు చోట్ల కలుషితాహారం తిని బాలికలు అనారోగ్యం బారిన పడడం, వైద్యశాలల్లో చేరడం వంటి అంశాలను గమనంలోకి తీసుకున్న అధికారులు ఈ ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. ఉదయం జావ అందించడం నుంచి రాత్రి భోజనం వరకు ఆహార పదార్థాల తయారీని పరిశీలించడానికి రోజూ ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లోని ఏఎన్ఎంలకు ఈ బాధ్యత అప్పగించారు. వీరు కచ్చితంగా నిత్యం వంట వడ్డన సహా విద్యార్థులు భోజనం చేస్తున్న విషయాలను ప్రతిరోజూ ఫొటోలు తీసి సమర్పిస్తున్నారు. ఇంకా వంటగది శుభ్రత, వంట వండే మహిళలు ప్రత్యేక దుస్తులు ధరించడం, మాస్క్ ధరించడం



తదితరం అమలుపరుస్తున్నారా లేదా అని గమనించేందుకు కూడా ఈ చిత్రాలు దోహదపడతాయని అధికారులు భావిస్తున్నారు. అవగాహన సదస్సులను కూడా అధికారులు నిర్వహించి భోజనమాతలకు దిశానిర్దేశం చేసారు. జిల్లాలో 11 కేజీబీవీల్లో ఏ యన్ యంలున్నారు.

పాలనాధికారి ఆదేశాలు పాటిస్తున్నాం

-గౌసియా బేగం, బాలికావిద్య ప్రత్యేకాధికారిణి, జనగామ

జిల్లాలోని 11 మంది ఏఎన్ఎంలు కేజీబీవీల్లో ఉన్నారు. వీరు సహా వంట వండేవారికి జిల్లా యంత్రాంగం రుచి శుచి శుభ్రత గురించి గత ఏడాది శిక్షణ ఇచ్చారు. జిల్లా పాలనాధికారి ఆదేశాల మేరకు బాధ్యులు నిత్యం ఫొటోలు తీసి పంపిస్తున్నారు. విద్యాశాఖ అధికారి కూడా నిత్యం విద్యాలయాలను సందర్శించి వంటలను పరిశీలించి తగు సూచనలిస్తున్నారు. ఏఎన్ఎంలు లేని కేజీబీవీల్లో ఇతర ఉద్యోగులకు బాధ్యత అప్పగిచాం. నాణ్యత లేని కూరగాయలు వాడకం పూర్తిగా నిలిచిపోయింది.

# సమస్యలతో సతమతం

ములుగు : 22వ డివిజన్ పరిధిలోని బ్యాంక్‌కాలనీ, శాంతినగర్, వాసవీ కాలనీల్లో సమస్యలతో స్థానికులు సతమతం అవుతున్నారు. రాజకీయ నేతలు, బడా వ్యాపారులు, సీఏలు, డాక్టర్లు, ఇంజినీర్లు తదితర రంగాల ప్రముఖులు ఉన్నా సమస్యల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. గత నెల చివరి వారంలో కురిసిన వర్షాలకు బ్యాంక్ కాలనీకి వరద ముప్పు తప్పలేదు. అటు దేశాయిపేట రోడ్డు, ఇటు 80 అడుగుల రహదారిలో రాకపోకలు నిలిచాయి. భవిష్యత్తులో సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని స్థానికులు



కోరుతున్నారు. ఈ కాలనీల్లో భూ వివాదాలు కూడా పరిష్కారం కావడం లేదు. రెండ్రోజుల కిందట శాంతినగర్‌లో ఒకరు చేపట్టిన ప్రహరీ నిర్మాణం వివాదాస్పదంగా మారింది. తన స్థలంలో ప్రహరీ నిర్మించుకుంటున్నానని ఒకరంటే.. అది రోడ్డు స్థలమని కాలనీ వాసులు అభ్యంతరం చెబుతున్నారు. కొన్ని వీధుల్లో డ్రైనేజీలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయినా శుభ్రం చేయడం లేదు.నిధులు విడుదల చేయాలి-బస్వరాజు కుమార్, కార్పొరేటర్

సమస్యలు ఉన్నది వాస్తవమే. అభివృద్ధి పనుల కోసం చాలా వరకు ప్రతిపాదనలు పంపించాం. నిధుల మంజూరు చేసి, టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తే తప్ప పనులు చేపట్టడానికి వీలుకాదు. ప్రాధాన్యతా క్రమంలో ఒక్కో పని చేసుకుంటూ పోతున్నాం.

# కాలువ ఇలా... సాగునీరు పారేదెలా

రోళ్లవాగు ప్రధాన కాలువ ద్వారా సాగు నీరందించే కాలువల షెట్టర్లు చాలా చోట్ల దెబ్బతిన్నాయి. ఈ కారణంగా చివరి గ్రామాలకు సాగు నీరందించడం గగనంగా మారుతోంది. ఎస్సారెస్పీ కాలువల చివరి భూములకు నీరందించాల్సిన సమయంలో కాలువల షెట్టర్లు చాలా చోట్ల దెబ్బతిన్నాయి. ఉప కాలువల నిర్వహణ పట్టించుకో



కపోవడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. రోళ్లవాగు 4ఎల్ కాలువ చాలా చోట్ల దెబ్బతింది. కాలువలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. బీర్‌పూర్, తీగలధర్మారం, మగ్గిడి ద్వారా దొంతాపూర్, ఎడపెల్లికి కాలువ ద్వారా 400 ఎకరాలకు సాగు నీరందించాల్సి ఉండగా నీరు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. కాలువల షెట్టర్లకు మరమ్మతులు చేసి పొదలను తొలగించి నీరు సక్రమంగా పారేలా చూడాలని అన్నదాతలు కోరుతున్నారు.

# ఖజానాకు గండి.. అక్రమాలు దండి!

జయశంకర్ : జిల్లాలో వాగుల ప్రవాహంతో భూగర్భ జలాలు పెంపొందుతున్నాయి. చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల్లో పారుతున్న వాగుల ఆధారంగా వందలాది ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. వాగుల ప్రవాహ ధాటికి ఇసుక భారీగా పేరుకుపోతోంది.. దీనిమీద కన్నేసిన అక్రమార్కులు అనుమతులేకుండా తవ్వకాలు చేపట్టి పట్టణాలకు తరలిస్తున్నారు. చిట్యాల మండలంలోని కల్వపల్లి, చలివాగుల నుంచి, టేకుమట్ల మండలంలోని మానేరు వాగు, మొగుళ్లపల్లి మండలంలోని పెద్దవాగుల్లోని ఇసుకను అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. ఈ మూడు మండలాల్లోని పరిసరాల గ్రామాలతో పాటు, భూపాలపల్లి, పరకాల, జమ్మికుంట, హనుమకొండ పట్టణాలకు సైతం గుట్టుగా తరలిస్తున్నారు. దూరాన్ని బట్టి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కాళేశ్వరం ఇసుక రీచుల సంఖ్య తగ్గడంతో ఈ ప్రాంతాల్లో డిమాండ్ పెరిగింది. దూరాన్ని బట్టి ట్రాక్టరుకు రూ.3 వేల నుంచి రూ.10 వేలకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ అధికారిక ఇసుక రీచుల్లో టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో క్యూబిక్ మీటరుకు రూ.600 విక్రయిస్తున్నారు. అక్రమార్కులు మూడు రెట్లకు అధికంగా విక్రయిస్తున్నారు. అనుమతులు లేకుండా తరలిస్తుండటంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, అటవీ శాఖలు, మైనింగ్, ఇరిగేషన్ తదితర శాఖల పర్యవేక్షణ ఉండాల్సి ఉన్నా అంతగా పట్టించుకోవడం లేదు.




స్థానికులు అందించిన సమాచారంతో, పోలీసులు వాహన తనిఖీల సమయంలో అనుమతులేని ఇసుక ట్రాక్టర్లను పట్టుకుంటున్నారు. అయితే వారి దృష్టికి వచ్చినప్పుడు మాత్రమే అక్రమాలకు అడ్డుకట్ట పడుతోంది. తర్వాత షరామామూలే.. జరిమానాలు కట్టి బయటకు వచ్చి మళ్లీ అదే దందా చేస్తున్నారు.

నంబరు ప్లేట్లు లేని ట్రాక్టర్లు..

మూడు మండలాల్లో రోజుకు కనీసం 100 నుంచి 150 వరకు ట్రాక్టర్ల ఇసుకను తరలిస్తుంటారు. ఇసుక రవాణా చేసే ట్రాక్టర్లకు నంబరు ప్లేట్లు ఉండవు. ఎవరైనా సమాచారం ఇచ్చినా, ఫొటోలు తీసినా ఆధారాలు లేకుండా నంబర్ ప్లేట్లు తీసేసి జాగ్రత్త పడుతున్నారు. ఇసుక నిల్వలు తరిగిపోతుండటంతో వాగుల పరిసరాల్లో పంటలు సాగు చేసుకుంటున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇసుక నిల్వలు లేకుంటే నీటి నిల్వలు ఉండవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక అక్రమాలకు చెక్ పెట్టాలని కోరుతున్నారు. తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేసి, రేయింబవళ్లు గస్తీలు చేపట్టాలి. అధికారుల పర్యవేక్షణతో ఇసుక అక్రమాలకు నివారించాల్సిన అవసరం ఉంది.

# స్వీయ సంపాదనలో అతివలు!

రంగంపేట : స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) మహిళల్లో చైతన్యం వెల్లివిరుస్తోంది. ఇంట్లో ఖాళీగా కూర్చోకుండా మహిళలు స్వయం ఉపాధి అవకాశాల వైపు అడుగేస్తున్నారు. పొదుపు సంఘం ద్వారా లభించే లింకేజీ రుణంతో ఇళ్లలోనే చిన్న చిన్న కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుంటున్నారు. బయటకెళ్లకుండా ఇంటి వద్దనే ఉపాధి పొందుతున్నారు. నగరంలో మహిళల కోసం ప్రత్యేక పరిశ్రమలు లేకపోవడంతో సొంతంగానే నెలవారీ ఆదాయ మార్గాలకు బాటలు వేసుకుంటున్నారు. కాజీపేట ప్రాంతానికి చెందిన ఇద్దరు మహిళలు విజయ, సరిత గ్రేటర్ వరంగల్ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) అధికారులు, సీవోలు, పొదుపు సంఘాలు అందజేసే స్వయం ఉపాధి పొందుతున్న వీరి విజయగాథపై కథనం. 47వ డివిజన్ కాజీపేట బాపూజీ నగర్‌కు చెందిన భాషబోయిన విజయ సాధారణ గృహిణి. అరుణోదయ మహిళ పొదుపు సంఘం సభ్యురాలిగా చేరింది. తరుచూ సమావేశాలకు హాజరైంది. స్వయం ఉపాధి పొందేందుకు హనుమకొండ ప్రాంతంలో అప్పడాలు తయారీ కేంద్రాన్ని పరిశీలించింది. ఇంట్లోనే సొంతంగా అప్పడాల తయారీ చేయాలనుకుంది. (శ్రీ చైతన్య స్లమ్ సమాఖ్య, కాకతీయ టౌన్ లెవల్ సమాఖ్య(టీఎల్ఎఫ్) సహకారంతో పొదుపు సంఘానికి రుణం రావడంతో రూ.55వేలతో



యంత్రాలు కొనుగోలు చేసింది. అత్త, భర్త సహకారంతో తెల్ల అప్పడాలు, చక్రాలు, పొడుగు గొట్టాలు, ఏబీసీడీ తదితర డిజైన్లు కలిగినవి తయారు చేస్తున్నారు. వీటిని తన భర్త కిరాణం దుకాణాలు, బేకరీల్లో అమ్ముతున్నారని, నెలకు రూ.12వేల ఆదాయం పొందుతున్నట్లు భాషబోయిన విజయ తెలిపారు.

చెత్త కేంద్రం నిర్వహణతో..నా పేరు బలభద్ర సరిత, మాది కాజీపేట విష్ణుపురికి చెందిన బలభద్ర సరితకు ఐదుగురు అక్కా, చెల్లెళ్లు, ఒక తమ్ముడు ఉన్నాడు. వారి నాన్న చిన్నప్పుడే చనిపోయారు.. 2005లో స్వర్ణ మహిళా పొదుపు సంఘంలో సరిత సభ్యురాలిగా చేరారు. సంఘం పుస్తక నిర్వహణ చేస్తూనే ఆర్పీగా శిక్షణ పొందారు. 2015లో కాజీపేటలో పొడి చెత్త నిర్వహణ కేంద్రం(డీఆర్సీ) మంజూరు కాగా నిర్వహణ బాధ్యతలు నాకు అప్పగించారు. బీటీసీ, ఈ-శ్రీ ఫౌండేషన్ ద్వారా 'వాచ్ వెల్‌బీయింగ్ అవుటు ఆఫ్ వేస్ట్' సేకరిస్తున్నారు. కిలోల చొప్పున ప్లాస్టిక్, కాగితం, ఇతరాలు కొనుగోలు చేయడం వల్ల పారిశుద్ధ్య కార్మికులకు రోజూ ఆదాయం వస్తుంది. ఆర్పీగా రూ.6వేలు, పొడి చెత్త నిర్వహణ కేంద్రంపై నెలకు రూ.6వేల పైనే ఆదాయం పొందుతున్నట్లు సరిత తెలిపారు.

# నెరవేరనున్న 100 పడకల ఆసుపత్రి కల




తొర్రూరు : కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. రెవెన్యూ డివిజన్ కేంద్రమైన తొర్రూరులోని 30 పడకల ఆసుపత్రితో సరైన వైద్యసేవలు అందక రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి లేదా ఎంజీఎంకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. విశాలమైన భవనం ఉన్నా.. ఆసుపత్రి ఉన్నతీకరణ చెందకపోవడంతో తిప్పలు తప్పడం లేదు. యూపీహెచ్‌సీగాఉన్న ఆసుపత్రిని సీహెచ్‌సీగా మార్చాలంటూ గతంలో పలు సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు చేసి మంత్రికి, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించారు.

మంత్రి ఎర్రబెల్లి చొరవతో..

ఆసుపత్రి ఉన్నతీకరణ అంశాన్ని గతంలో మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి ప్రజాసంఘాల నాయకులు తీసుకెళ్లారు. ఈ నెల 14న తొర్రూరులోని భారాస కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆసుపత్రి ఉన్నతీకరణ అంశాన్ని హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. యూపీహెచ్‌సీని త్వరలోనే 100 పడకల ఆసుపత్రిగా ఉన్నతీకరిస్తామని హరీశ్‌రావు హామీ ఇచ్చారు.

ఉన్నతీకరణతో ప్రయోజనాలివి..

ఆసుపత్రిని ఉన్నతీకరిస్తే గైనకాలజిస్ట్, ఎనస్తీషియా, సర్జన్, పిడియాట్రిక్, సివిల్ సర్జన్ వంటి ప్రత్యేక వైద్య నిపుణులను నియమిస్తారు. దీంతో పాటు సదరం శిబిరాలను ఇక్కడే నిర్వహించవచ్చు. పూర్తి స్థాయిలో ప్రసవాలు చేసేందుకు అవకాశం ఉంటుంది. పోస్టుమార్టం కోసం గతంలోనే ప్రత్యేకగదిని నిర్మించారు. పోస్టుమార్టం సేవలు ప్రారంభమవుతాయి. ఎఫ్ఎన్‌వో, ఎమ్ఎన్‌వో, వార్డుబాయ్స్, స్వీపర్‌లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఎక్స్‌రే నిపుణులు, తదితర సిబ్బంది నియమితులవుతారు. దీంతో రోగులకు పూర్తిస్థాయిలో 24 గంటలు మెరుగైన వైద్య సేవలు అందుతాయి.

తీరనున్న ఇబ్బందులు

స్థానిక రిక్షా కాలనీ సమీపంలో విశాలమైన భవనం ఉంది. ఆసుపత్రిని ఉన్నతీకరిస్తే మరిన్ని అదనపు భవనాల నిర్మాణానికి తగినంత స్థలం ఉంది. అవసరమైతే ప్రస్తుత భవనంపై అదనంగా గదులు నిర్మించొచ్చు. ప్రస్తుతం గర్భిణులు ప్రసవాల కోసం వర్ధన్నపేట, మహబూబాబాద్‌కు వెళ్తున్నారు. పోస్టుమార్టం కోసం మహబూబాబాద్ ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోంది. ఆసుపత్రిని అభివృద్ధి చేస్తే ఈ సేవలన్నీ ఇక్కడే పొందవచ్చు. రోగులకు ఎంతో మేలు చేకూరుతుంది.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం..

గుండాల మురళీధర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో

ఆసుపత్రి ఉన్నతీకరణపై గతంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. దవాఖానాను అభివృద్ధి చేస్తే మరింత మెరుగైన వైద్యసేవలు అందుతాయి. ప్రసవాలు, పోస్టుమార్టం కోసం మహబూబాబాద్, వర్ధన్నపేట ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. వైద్యులు, వైద్యసిబ్బంది పెరిగి రోగులకు అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి.

# చెరువులను చెరపట్టారు!



భూపాలపల్లి : చెరువులు, నీటి కుంటలు రియల్ వ్యాపారుల ఆక్రమణతో ఆనవాళ్లు కోల్పోతున్నాయి. చెరువుల పూర్తి నీటి నిల్వ సామర్థ్యం (ఎఫ్‌టీఎల్) నిర్ధారించలేకపోవడంతో పాటు హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో శిఖం భూములు మాయమవుతున్నాయి. జిల్లా కేంద్రంతో పాటు, మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే కొన్ని చెరువులు, కుంటల స్థలాల్లో ఇళ్లను నిర్మించుకుంటుండగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పంటలు సాగు చేస్తూ కబ్జాలకు పాల్పడుతున్నారు. జిల్లాలోని 11 మండలాల్లో 758 చెరువులు, 461 నీటి కుంటలు మొత్తం కలిపి 1,219 చెరువులున్నట్లు నీటి పారుదల అధికారుల రికార్డుల ఆధారంగా తెలిసింది. వీటిలో దశలవారీగా మిషన్ కాకతీయ కింద పూడికతీత పనులు చేపట్టారు.

మచ్చుకు కొన్ని..భూపాలపల్లి పట్టణంలోని పాత ఎర్ర చెరువు శిఖంలో భూముల్లో కొన్నేళ్లుగా సుమారు నాలుగెకరాలు ఆక్రమణకు గురైంది. నీటి నిల్వ లేకుండా సింగరేణి యాజమాన్యం ఈ చెరువు వెనుక భాగంలో ఆయకట్టు భూములను స్వాధీనం చేసుకోవడంతో ప్రస్తుతం నిరుపయోగంగానే ఉన్నాయి. తాజాగా మరో 20 గుంట భూముల్లో దర్జాగా సిమెంటు ఇటుకలతో అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. కొద్ది రోజుల క్రితం రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేసినా, మళ్లీ యథేచ్ఛగా కట్టడాలు కొనసాగుతున్నాయి. పురపాలక సంఘం పరిధిలోని మహబూబ్‌పల్లి గ్రామ శివారులో సోమన్నకుంట చెరువు శిఖం భూములు సర్వే నంబరు 552లో మొత్తం 22.30 ఎకరాల వరకు ఉంటాయి. చెరువు శిఖం భూమిలోనే ఎకరం వరకు శ్మశానవాటికకు కేటాయించారు. ఈ శ్మశానవాటికకు సంబంధించి సుమారు 20 గుంటల భూమిని కొందరు స్థిరాస్తి వ్యాపారులు అక్రమించుకున్నట్లు గ్రామస్థులు కొందరు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. శిఖం భూమిలో నుంచి మహబూబ్‌పల్లి నుంచి కొంపెల్లి క్రాస్‌రోడ్డు వరకు రహదారి ఉంటుంది. రహదారి పక్కన శిఖం భూమిలోనే వరి సాగు చేసుకుంటున్నారు. జంగేడు నుంచి గొర్లవీడు వరకు గత రహదారి మధ్యలో అనుసాన్‌పల్లి గ్రామ సమీపంలో పెద్ద చెరువు ఉంటుంది. చెరువు శిఖం భూములు సుమారు ఐదు నుంచి ఆరు ఎకరాల వరకు కబ్జా చేశారు. శిఖం భూములను కొందరు అక్రమంగా పట్టాలు చేసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం కొందరు రబీలో వరి సాగు చేసుకుంటున్నారు. భూపాలపల్లి పట్టణానికి అతి సమీపంలోనే బొబ్బగట్టు చెరువు ఉంటుంది. చెరువుకు వరద కాల్వ సుమారు 3 కి.మీ పొడవు ఉంటుంది. పట్టణానికి సమీపంలోని వ్యవసాయ భూములు చాలా వరకు రియల్టర్ల చేతుల్లోకి వెళ్లాయి. మిగతా వరి పండే భూములను సైతం స్థిరాస్తి వ్యాపారులు కొనుగోలు చేసి, ప్లాట్లుగా విభజించి విక్రయాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలోనే ఓ వెంచర్‌కు రహదారి సౌకర్యం లేకపోవడంతో వరద కాల్వనే కబ్జా చేసి, పైపు కల్వర్టు నిర్మాణానికి పూనుకున్నారు.

మంజూరునగర్ ప్రాంతంలోని గోరంట్లకుంట, తుమ్మల చెరువు శిఖం భూముల్లో అక్రమంగా కొందరు వెంచర్‌లు ఏర్పాటు చేసి, అందులో ప్లాట్లుగా విభజించి, రోడ్లు మట్టితో నిర్మించి, అమ్మకాలు కొనసాగిస్తున్నారు. చెరువు శిఖం భూములు సుమారు 5 ఎకరాలకు పైగా కబ్జాకు గురైంది. ఆక్రమణకు గురైన శిఖం భూముల విలువ సుమారు రూ.10 కోట్ల వరకు ఉంటుంది.


విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

మహ్మద్ ఇక్బాల్, తహసీల్దారు

భూపాలపల్లి పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీ సమీపంలోని పాత ఎర్ర చెరువు శిఖం భూముల్లో కొందరు కబ్జా చేసుకున్నట్లు మా దృష్టికి వచ్చింది. సిమెంటు ఇటుకలతో నిర్మించుకున్న షెడ్లను తొలగిస్తాం. విచారించి చర్యలు తీసుకుంటాం.

# కాగితాలు ఏరుతూ.. చోరీలు చేస్తూ..

వరంగల్ : వరంగల్ పోలీసు డివిజన్‌లో మట్వాడ ఠాణా పరిధిలో చిత్తు కాగితాలు ఏరుతూ చోరీలకు పాల్పడుతున్న ముఠాను సీసీఎస్, మట్వాడ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. సీసీఎస్‌లో వరంగల్ ఏసీపీ గిరికుమార్ నిందితుల వివరాలను వెల్లడించారు. హనుమకొండ జిల్లా మడికొండకు చెందిన ఆలేటి మైసమ్మ అలియాస్ కడమంచి మైసమ్మ, ఊర దివ్య, నూనె రామక్క, నూనె ఎల్లయ్య అలియాస్ గజ్జి ఎల్లయ్యను అరెస్టు చేసి వారి నుంచి రూ. 2 లక్షల విలువ చేసే జనరేటర్, రెడియేటర్, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. వీరందరూ దగ్గరి బంధువులు. చిత్తు కాగితాలు ఏరుకుంటూ, ఇనుప సామన్లు సేకరిస్తూ జీవించేవారు. ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లోని వర్క్‌షాపు ఆవరణలోని జనరేటర్, రేడియేటర్‌ను ఈనెల 13న తెల్లవారుజామున చోరీ చేశారు. కంపెనీ యజమాని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించిన పోలీసులు నిందితులను గుర్తించి, వారి కదలికలపై నిఘా పెట్టారు. రెడియేటర్‌ను విక్రయించేందుకు ఆటోనగర్‌కు ఆటోలో వస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు వెళ్లి వారిని పట్టుకున్నారు. వస్తువులను స్వాధీనం చేసుకొని



నిందితులను కోర్టులో హాజరుపరిచారు. వారిని సకాలంలో పట్టుకోవడంలో ప్రతిభ కబనర్చిన క్రైం అండ్ అపరేషన్ అదనపు డీసీపీ పుష్పా, ఏసీపీలు డేవిడ్‌రాజ్, గిరికుమార్, సీఐలు రమేశ్‌కుమార్, శ్రీనివాస్‌రావు, రమేశ్‌ను సీపీ రంగనాథ్ అభినందించారు.

# పర్యాటకానికి నోచని జలాశయం

ఘన్‌పూర్ : పక్కనే జాతీయ రహదారి.. రైల్వే స్టేషన్ పైగా డివిజన్ కేంద్రం కావడంతో స్టేషన్‌ఘన్‌పూర్ ప్రాధాన్యం సంతరించుకుంది.. ఇక్కడి జలాశయాన్ని పర్యాటక కేంద్రంగా మార్చాలని స్థానికుల కోరుతున్నారు. బోటింగ్ ఏర్పాటు చేస్తే పర్యాటకుల తాకిడి పెరుగుతుంది.. గత సెప్టెంబరు నెలలో దేవాదుల జలాశయంలో చేప పిల్లలను విడుదల చేసేందుకు వచ్చిన రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు మత్స్య పారిశ్రామిక శాఖ కమిషనర్ లచ్చిరామ్ నాయక్‌కు ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ బండ ప్రకాష్‌కు ఇక్కడి మత్స్యకారులు ప్రజలు నాయకులు దీని గురించి వినతులు అందించారు. అయినా నేటికీ ఎవరూ స్పందించలేదు. జలాశయం కట్టపై భారీగా చెట్లు పెరగటంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రోజూ వివిధ ప్రాంతాలకు చెందిన యువతీ యువకులు ద్విచక్ర వాహనాల్లో, కార్లలో వచ్చి మద్యం తాగి హంగామా చేస్తున్నారు. జలాశయం రాతి కట్టడంపై మద్యం తాగిన తర్వాత ఆ బాటిల్స్‌ను పగలగొట్టడంతో మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జలాశయ నిర్మాణం పూర్తయిన మొదట్లో ఘన్‌పూర్, చాగల్లు, ఇందిరానగర్, కొత్తపల్లి, శివునిపల్లి గ్రామాలకు చెందిన వారు వందల సంఖ్యలో వచ్చి రోజూ ఉదయం ఇక్కడ వాకింగ్ చేసేవారు. ఎస్సై, కానిస్టేబుల్, రైల్వే ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ



యువకులు కట్టపై సాధన చేసేవారు. ప్రస్తుతం చెట్లు విపరీతంగా పెరగడంతో ఎవరూ ఇటువైపు రావడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జలాశయం కట్టపై చెట్లను తొలగించి చదును చేస్తే క్రీడాకారులు, నడకదారులకు ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు అంటున్నారు.

పొంచి ఉన్న ప్రమాదందేవాదుల జలాశయం పనులు 2004లో ప్రారంభం కాగా 2009లో పూర్తయింది. అప్పటి నుంచి కనీసం ఒక పిచ్చిమొక్కను కూడా అధికారులు తొలగించలేదు. చెట్ల వేర్లు కట్టలోకి చొచ్చుకొచ్చి పలుచోట్ల పగుళ్లు ఏర్పడుతున్నాయి. నీరు లీకేజీ అయ్యే ప్రమాదం ఉందని రైతులు, మత్స్యకారులు వాపోతున్నారు. నాలుగేళ్లుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 1.57 టీఎంసీల వరకు నీరు చేరుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే తుమ్మ చెట్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై నీటిపారుదల శాఖ ఏఈ ఎండీ యాసర్ మాట్లాడుతూ.. దేవాదుల జలాశయం కట్టపై పెరిగిన చెట్ల తొలగింపునకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పూర్తి స్థాయిలో తొలగింపు పనులు చేపడుతామని అన్నారు.

# పర్యవేక్షణ లోపం.. వివాదాలకు ఊతం

భూపాలపల్లి : వెంకటాపురం మండలంలోని చిరుతపల్లిలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల (చిరుతపల్లి-2) వివాదాలకు నెలవుగా మారింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, ఆశ్రమ పాఠశాల బాధ్యులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయ లేమి వివాదాలకు ఊతమిస్తోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇరువర్గాల మధ్య నెలకొన్న పంచాయితీ ఇటీవల పోలీస్ స్టేషన్ వరకు చేరింది. శుక్రవారం ఏటూరునాగారం ఐటీడీఏకు చెందిన గిరిజన సంక్షేమ విద్యాశాఖ ఉన్నతాధికారుల వద్దకు విషయం వెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. ఇంత జరుగుతున్నా అంతా గోప్యతను పాటిస్తుండటం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పోలీసుల వద్దకు చేరిన పంచాయితీ!

ఈ ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న వివాదం వెంకటాపురం పోలీసుల వద్దకు చేరింది. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయురాలు పక్షం రోజుల కిందట లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. వసతి గృహం పరిధికి చెందిన నివాస గృహంలో ఉంటున్న తనపై ఈ నెల 10వ తేదీ రాత్రి దాడి చేసేందుకు ప్రయత్నించారని, భవనం తలుపులను రాళ్లతో కొట్టి భయభ్రాంతులకు గురి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతకు ముందు ఇదే ఆశ్రమంలో విధులు నిర్వహిస్తున్న సీఆర్టీకి తనకు స్వల్ప వివాదం జరిగిందని.. దీనిపై ప్రధానోపాధ్యాయుడు, ఐటీడీఏ అధికారులకు సైతం సమాచారం అందించి నట్లు వివరించారు. దీనిపై రెండు రోజుల కిందట పోలీసులు ప్రాథమిక వివరాలు సేకరించినట్లు సమాచారం. మరోవైపు ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయురాలి వైఖరిపై సైతం మరో వర్గం ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

సఖ్యత లేకపోవడమే కారణమా?

3 నుంచి 10 తరగతులు విద్యాబోధన జరుగుతున్న ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 125 మంది బాలికలు అభ్యసిస్తున్నారు. ప్రాథమిక, ఉన్నత విద్యాబోధన, వసతి పొందుతున్న ఇక్కడ ఏడుగురు మహిళా ఉపాధ్యాయులు, ఒక పురుష ఉపాధ్యాయుడు(ప్రధానోపాధ్యాయుడు) విధులు నిర్వహిస్తున్నారు. పలు పోస్టులు ఖాళీగా ఉండటంలో ముగ్గురు సీఆర్టీలను నియమించారు. శాశ్వత పోస్టుల కేటాయింపు లేకపోవడంతో సూపర్‌న్యూమరీ ప్రాతిపదికన విధులను నెట్టుకొస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు, వార్డెన్ పోస్టును పురుష ఉపాధ్యాయుడు ఒక్కరే నిర్వహిస్తుండటం, అందులోనూ దీర్ఘకాలికంగా ఇక్కడనే సూపర్‌న్యూమరీపై పని చేస్తుండటంతో సహ ఉపాధ్యాయుల మధ్య సఖ్యత లోపిస్తున్నట్లు తెలుస్తోంది. ఆశ్రమం నిర్వహణకు సంబంధించిన పలు విషయాల్లో సీఆర్టీలకు ప్రాధాన్యం ఇస్తుండటంతో శాశ్వత ఉపాధ్యాయులు గుర్రుగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయం సైతం ఉన్నతాధికారుల వద్దకు వెళ్లినా కొలిక్కి తెచ్చే ప్రయత్నాలు చేయకపోవడంతోనే వివాదాలకు ఊతమిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఐటీడీఏ ఉన్నతాధికారులు లోతైన విచారణ చేస్తేనే ఇక్కడ వివాదం కొలిక్కి రానుంది. లేదంటే మరింత జటిలంగా మారనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

# పోసానిపై పరువు నష్టం కేసు.. కోర్టుకు హాజరైన నారా లోకేశ్



మంగళగిరి: గుంటూరు జిల్లా మంగళగిరి కోర్టుకు తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హాజరయ్యారు. వైకాపా నేతలపై వేసిన పరువు నష్టం కేసులో తన వాంగ్మూలం ఇచ్చేందుకు ఆయన వచ్చారు. తనపై తప్పుడు ఆరోపణలు చేసిన ఏపీ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పోసాని కృష్ణ మురళితో పాటు సింగలూరు శాంతిప్రసాద్‌పై లోకేశ్ పరువు నష్టం కేసు దాఖలు చేశారు. తాడికొండ మండలం కంతేరులో 14 ఎకరాల పొలాన్ని లోకేశ్ కొనుగోలు చేశారని పోసాని కృష్ణమురళి ఆరోపించారు.

ఓ ఛానెల్ నిర్వహించిన చర్చలో సింగలూరు ప్రసాద్ కూడా ఆరోపణలు చేశారు. ఈ కేసుల్లో వీరిద్దరికీ న్యాయస్థానం ద్వారా నోటీసులు పంపినా స్పందించలేదని లోకేశ్ తెలిపారు.

**మంగళగిరిలో భారీ మెజారిటీతో గెలిచేది నేనే:** వచ్చే 2024 అసెంబ్లీ ఎన్నికల్లో మంగళగిరి నుంచే తాను పోటీ చేయనున్నట్లు తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. వైకాపా నేతలపై వేసిన పరువు నష్టం కేసులో తన వాంగ్మూలం ఇచ్చేందుకు మంగళగిరి కోర్టుకు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. మంగళగిరిలో భారీ మెజారిటీతో గెలిచేది తానేనని చెప్పారు. వైకాపా పాలనలో పరిశ్రమలేవీ రాష్ట్రానికి రావట్లేదు.. ఉన్నవి కూడా తరలిపోతున్నాయని లోకేశ్ విమర్శించారు.

# శేషాచల కొండల్లో కొనసాగుతున్న ఆపరేషన్ చిరుత..



శేషాచల కొండల్లో ఆపరేషన్ చిరుత కొనసాగుతోంది. టీటీడీ,అటవీ శాఖ సంయుక్త ఆపరేషన్ నిర్వహించారు. మూడు ప్రాంతాల్లో ఏర్పాట్లు చేసిన బోన్లకు అదనంగా మరి కొన్ని బోన్లను అటవీ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. అలిపిరి నడకమార్గంలో చిరుతల సంచారం గుర్తించేందుకు 320 ట్రాప్ కెమెరాలకీ అదనంగా మరో 200 కెమెరాలను టీటీడీ ఏర్పాటు చేసింది. శ్రీవారి మెట్టు మార్గంలో 82 కెమెరాలని అటవీ అధికారులు ఏర్పాటు చేశారు. అలిపిరి కాలిబాట మార్గంలో ప్రస్తుతానికి జంతు సంచారం లేదని డీఎఫ్ఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. శ్రీవారి మెట్టు మార్గంలో పలు జంతువుల సంచారాన్ని గుర్తించామన్నారు. ఈ ప్రాంతంలో జంతు సంచారంపై అధ్యయనం చెయ్యడానికి మరి కొంత సమయం పడుతుందన్నారు. కాలినడకన వచ్చే భక్తులు గుంపులుగా రావాలని సూచించారు. ఎలాంటి భయాందోళన లేకుండా భక్తులు నడకమార్గంలో రావచ్చని టీటీడీ డీఎఫ్ఓ శ్రీనివాసులు తెలిపారు.



# అప్పు చెల్లించకపోతే అడ్డగోలు ఛార్జీలొద్దు..!

బ్యాంకులు, న్యాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థల వద్ద అప్పులు చేసి ఆ తర్వాత దివాలా తీసిన వారికి ఆర్‌బీఐ కొంత ఊరటనిచ్చింది. ఈ మేరకు తన పరిధిలో పనిచేసే వాణిజ్య బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, ఇతర రుణదాతలు లేదా రెగ్యులేటేడ్ సంస్థలు (ఆర్‌ఈ) జరిమానా రూపంలో వసూలు చేసే వడ్డీ విషయంలో సహేతుకంగా, పారదర్శకంగా ఉండాలని సూచించింది. రుణగ్రహీతలు చెల్లించలేని సమయంలో చాలా సంస్థలు నిబంధనలు ఆసరాగా చేసుకొని జరిమానా వడ్డీ రేట్లను సాధారణంగా కంటే అధికంగా వసూలు చేస్తున్నట్లు తాము గుర్తించామని పేర్కొంది. "జరిమానా వడ్డీ లేదా ఛార్జీలను కేవలం రుణ గ్రహీతల్లో క్రమశిక్షణ పెంచడానికి మాత్రమే వినియోగించాలి. అంతేకానీ, అటువంటి వాటిని ముందుగా చేసుకొన్న ఒప్పందం రేటు కంటే మించి ఆదాయం పెంచుకొనే సాధనాలుగా వాడకూడదు. ఈ సంస్థలు విధించే అత్యధిక వడ్డీరేట్లు.. వివాదాలు, ఫిర్యాదులకు దారి తీస్తున్నాయి" అని ఆర్‌బీఐ విడుదల చేసిన సర్క్యులర్‌లో పేర్కొంది. కొత్త మార్గదర్శకాల ప్రకారం రుణ నిబంధనల ప్రకారం చెల్లింపులు చేయలేకపోతే జరిమానాను ఛార్జీల రూపంలో మాత్రమే విధించాలి. అంతేకానీ, జరిమానా వడ్డీ ఛార్జీలను విధించకూడదు. దీనిని ఆదాయ మార్గంగా మార్చుకోకూడదు. అంతేకాదు.. ఈ ఛార్జీలపై భవిష్యత్తులో ఎలాంటి వడ్డీని విధించకూడదు. ఇది సాధారణ రుణాలపై విధించే చక్రవడ్డీకి వర్తించదని ఆర్‌బీఐ పేర్కొంది. అంతేకాదు.. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు వడ్డీకి మరే ఇతర అదనపు భారాలను జోడించకూడదని ఆర్‌బీఐ తేల్చిచెప్పింది. ఈ మార్గదర్శకాల స్ఫూర్తిని అర్థం చేసుకొని పాటించాలని పేర్కొంది. ఆర్‌బీఐ పరిధిలోని సంస్థలు జరిమానా వడ్డీ తదితర ఛార్జీల విధానాలను తయారు చేసి ఆమోదించేందుకు ఓ బోర్డు ఏర్పడనుంది. మంజూరు చేసిన రుణాల నిబంధన పరిధిలో జరిమానా ఛార్జీలు సహేతుకంగా ఉండేలా చూడనుంది. వ్యక్తిగత, వ్యాపారేతర రుణాలపై విధించే అపరాధ రుసుములు వ్యక్తిగతేతర రుణాలపై విధించే పీనల్ ఛార్జీల కంటే తక్కువగా ఉండాలి. తాజాగా ఆయా సంస్థలు తాము రుణాలు మంజూరు చేసే సమయంలో అపరాధ రుసుముల స్పష్టంగా వెల్లడించాలని ఆర్‌బీఐ చెబుతోంది. అంతేకాదు.. ఆయా సంస్థలు తమ వెబ్‌సైట్లలో వీటిని వడ్డీరేట్లు, సర్వీసు ఛార్జీల విభాగాల్లో ప్రదర్శించాలని చెబుతోంది. రుణ చెల్లింపుల్లు చేయని పక్షంలో రుణగ్రహీతలకు రిమైండర్లు పంపాల్సి ఉంటుంది. చెల్లింపులు చేయకపోతే విధించబోయే పీనల్ ఛార్జీలను ముందుగానే రుణగ్రహీతలకు తెలియజేయాల్సి ఉంటుంది. అంతేకాదు.. అపరాధ రుసుం విధించిన సందర్భం, కారణం కూడా వివరించాలి. ఈ నిబంధనలు మొత్తం 2024 జనవరి 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి.

# నంద్యాలలో భూమా వర్సెస్ భూమా ...!



కర్నూల్ : ఉమ్మడి కర్నూల్ జిల్లాలో నంద్యాల రాజకీయంగా కీలకమైన స్థానం. ఎంతో మంది దిగ్గజ నేతలు తమ రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించిన సీటు అది. అలాంటి సీటు ఇపుడు టీడీపీకి పూర్తిగా ట్రబుల్స్ ని పెడుతోంది. భూమా నాగిరెడ్డి బతికి ఉన్నంతవరకూ నంద్యాల విషయంలో జోక్యం ఉండేది కాదు, కానీ ఆయన మరణానంతరం వారసుల విషయంలో వచ్చిన తేడాలు విభేదాలు ఇపుడు రాజకీయ తెర మీద స్పష్టంగా కనిపిస్తున్నాయి. భూమా నాగిరెడ్డి చనిపోయేనాటికి ఆయన కుమారుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి చాలా చిన్నవారు అయితే ఇపుడు ఆయన యువకుడు అయ్యారు. యువ రాజకీయ వేత్తగా మారిపోయారు. ఆయన టీడీపీ నుంచి 2024 ఎన్నికల్లో టికెట్ ఆశిస్తున్నారు. కానీ చూడబోతే ఆ టికెట్ కాస్తా మాజీ ఎమ్మెల్యే, నంద్యాల ఇంచార్జి భూమా బ్రహ్మానందరెడ్డికి వెళ్ళేలా ఉంది. ఇటీవల చంద్రబాబు నంద్యాల సీటు విషయంలో సమీక్ష నిర్వహించి ఇండైరెక్ట్ గా బ్రహ్మానందరెడ్డికే టికెట్ అని చెప్పేశారు అని అంటున్నారు. దాని మీద తాజాగా జగత్ విఖ్యాత్ రెడ్డి అయితే కీలక కామెంట్స్ చేశారు. తన తండ్రి రాజకీయం నంద్యాలలో ఆపేశారని, అందువల్ల ఆ సీటు నుంచే తాను రాజకీయం మొదలెట్టానని చెప్పారు. తన తండ్రి ఆశయాలను నెరవేర్చడానికి తాను నంద్యాలలో రాజకీయం చేస్తానని అలా కాదని చెప్పే హక్కు ఎవరికీ లేదు అంటూ మాట్లాడారు. అంటే ఇండైరెక్ట్ గా ఆయన టీడీపీకి షాక్ ఇచ్చారని అంటున్నారు. తనను నంద్యాలలో తిరగవద్దు అని అధినాయకత్వం ఎక్కడా చెప్పలేదని కూడా ఆయన అంటున్నారు. తాను నంద్యాలలో ప్రతీ గడపకూ వెళ్తాను అని జగత్ విఖ్యాత్ గట్టిగానే చెబుతున్నారు. తన రాజకీయ ప్రస్థానం అంతా నంద్యాల నుంచే అని క్లియర్ గా చెప్పేశారు. దీంతో ఇపుడు నంద్యాల టీడీపీలో సరికొత్త వార్ మొదలైంది అంటున్నారు. కజిన్ గా ఉన్న బ్రహ్మానందరెడ్డికి భూమా సొంత కొడుకు జగత్ విఖ్యాత్ రెడ్డికి మధ్య పోటీ చాలానే ఉంది అంటున్నారు. ఇక టీడీపీలో సీనియర్ నేత ఫరూఖ్ తనకే టికెట్ అని అంటున్నారు. ఇంకో వైపు భూమా నాగిరెడ్డి అనుచరుడు అయిన ఏవీ సుబ్బారెడ్డి కూడా నంద్యాల టికెట్ రేసులో ఉన్నారు. దీన్ని బట్టి చూస్తూంటే నంద్యాల టీడీపీకి తలనొప్పిగా మారింది అని అంటున్నారు. అదే విధంగా నాగిరెడ్డి కుమారుడు నంద్యాల తన రాజకీయ వేదిక అంటూ చేసిన కామెంట్స్ చూస్తూంటే ఇక అన్నదమ్ముల సవాల్ కి నంద్యాల వేదికగా మరుతోంది అని అంటున్నారు. భూమా అఖిల ప్రియ 2917లో ఏరి కోరి తన కజిన్ భూమా బ్రహ్మానందరెడ్డిని ఎమ్మెల్యేగా చేసేందుకు శ్రమించింది. అదే కజిన్ ఇపుడు ఆమెకు కానీ ఆమె తమ్ముడు జగత్ విఖ్యాత్ రెడ్డికి కానీ నచ్చడంలేదు. తమ తండ్రి సీటు అని వారు అంటున్నారు. నిజానికి భూమా ఫ్యామిలీకి ఆళ్లగడ్డ మాత్రమే సొంత సీటు. ఆయన ఒకసారి ఎంపీగా పోటీ చేయడంతో ఆళ్ళగడ్డకు ఆయన సతీమణి శోభా నాగిరెడ్డి ఎమ్మెల్యేగా అయ్యారు. ఆ తరువాత భూమా దంపతులు ఇద్దరూ అసెంబ్లీకి పోటీ చేసినపుడు నాగిరెడ్డి తన భార్యకు ఆళ్లగడ్డ వదిలి తాను నంద్యాల షిఫ్ట్ అయ్యారు. ఈ రకంగా చూసుకుంటే నంద్యాల అన్నది టీడీపీ సీనియర్ నేత ఫరూఖ్ సొంత సీటు మాత్రమే అని చెబుతున్నారు. అయినా రాజకీయాలలో సీటు ఎవరికీ సొంతం కాదని అధినాయకత్వం ఎవరికి సీటు ఇస్తే వారు పనిచేసి తీరాలని అంటున్నారు. కానీ భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి అయితే పట్టు విడవడంలేదు. దాంతో భూమా వర్సెస్ భూమాగా నంద్యాల సీన్ మారిపోతోంది.



# ఆత్మహత్యల ఎఫెక్ట్.. కోటాలో కొత్త ఫ్యాన్లు..!

కోటా: వివిధ పోటీపరీక్షల కోచింగ్ సెంటర్లకు ప్రసిద్ధి చెందిన రాజస్థాన్‌లోని 'కోటా'లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలు కలవరపెడుతున్నాయి. దీంతో అప్రమత్తమైన స్థానిక యంత్రాంగం ఆత్మహత్యల నివారణకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే కోటాలోని అన్ని హాస్టళ్లు, పెయింగ్ గెస్ట్ (పీజీ) వసతుల్లో స్ప్రింగ్ లోడెడ్ ఫ్యాన్లను ఏర్పాటు చేయాలని జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశించారు. ఐఐటీ, జేఈఈ, నీట్ తదితర పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు పొరుగు రాష్ట్రాల నుంచి ఎంతో మంది విద్యార్థులు కోటాకు వచ్చి శిక్షణ పొందుతారు. ఈ ఏడాది దాదాపు 2.5లక్షల మంది అక్కడ శిక్షణ తీసుకుంటున్నట్లు అంచనా. అయితే, గత కొద్ది రోజులుగా ఇక్కడ తరచూ విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది ఇప్పటికే 20 మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. గత ఎనిమిదేళ్లతో పోలిస్తే ఈ ఏడాది కోటాలో ఆత్మహత్యల సంఖ్య ఎక్కువగా ఉంది. ఈ క్రమంలోనే కోటా జిల్లా యంత్రాంగం గతవారం సమావేశం నిర్వహించింది. విద్యార్థుల ఆత్మహత్యలను నివారించేందుకు పలు నిర్ణయాలు తీసుకుంది. మృతి చెందిన విద్యార్థుల్లో ఎక్కువ మంది ఫ్యాన్‌కు ఉరేసుకునే మరణించినట్లు గుర్తించిన అధికారులు.. హాస్టళ్లు, పీజీ గదుల్లో తక్షణమే వాటిని తొలగించాలని నిర్ణయించింది. వాటి స్థానంలో స్ప్రింగ్ లోడెడ్ ఫ్యాన్లను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. లోడ్‌ను గుర్తించిన క్షణంలోనే అన్‌కాయిల్ అయ్యేలా ఈ ఫ్యాన్లను తయారుచేశారు.

అంటే.. లోడ్ గుర్తించగా ఫ్యాన్ సీలింగ్ నుంచి విడిపోయి కిందకు వేలాడుతుంది. ప్రస్తుతం కోటాలోని హాస్టళ్లలో ఈ ఫ్యాన్లను శరవేగంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇక, దీంతో పాటు కోచింగ్ సంస్థలు కచ్చితంగా విద్యార్థులకు వీక్లీ ఆఫ్‌లు ఇవ్వాలని అధికారులు ఆదేశించారు. అంతేగాక, ఒక తరగతి గదిలో 80 మంది విద్యార్థులు మాత్రమే ఉండాలని స్పష్టం చేశారు. ఈ ఆదేశాలను పాటించని హాస్టళ్లు, పీసీ వసతులను వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు. చదువులో ఒత్తిడి కారణంగా విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్న విషయం తెలిసిందే.



# 21 మంది విద్యార్థుల్ని వెనక్కి పంపేసిన అమెరికా

హైదరాబాద్: అమెరికాకు వెళ్లిన 21 మంది భారతీయ విద్యార్థులకు చుక్కెదురైంది. వివిధ వర్సిటీల్లోని కోర్సుల్లో చేరేందుకు వెళ్లిన వారిని అమెరికా ఇమిగ్రేషన్ అధికారులు అట్లాంటా, శాన్‌ఫ్రాన్సిస్కో, షికాగో ఎయిర్‌పోర్ట్‌ల నుంచి రిటర్న్ ఫ్లైట్‌లు ఎక్కించారు. వివిధ పత్రాలు సక్రమంగా లేకపోవడం వంటి కారణాలను చూపారు. వారిలో ఎక్కువ మంది తెలుగు రాష్ట్రాలకు చెందిన వారే ఉన్నారు. విమానాశ్రయాలకు చేరుకున్నాక సాధారణ తనిఖీల్లో భాగంగా కొంతమందిపై అనుమానంతో అక్కడి ఇమిగ్రేషన్ అధికారులు ఆరా తీశారు. ప్రవేశాలు దక్కిన వర్సిటీలో ఫీజులు, విద్యార్థుల ఆర్థిక పరిస్థితులను పరిశీలించారు. ఫోన్లు, మెయిళ్లు, కన్సల్టెన్సీలు, అమెరికాలోని విద్యార్థులతో సంభాషణలను లోతుగా పరిశీలించిన అధికారులు వారిని తిప్పి పంపినట్లు తెలుస్తోంది.

ఒకసారి అమెరికా నుంచి డిపోర్ట్ అయిన విద్యార్థులు తిరిగి 5 ఏళ్ల దాకా ఆ దేశ వీసాకు దరఖాస్తు చేసుకోవడానికి అనర్హులు అవుతారు.



# రాణా అప్పగింతకు లైన్ క్లియర్ అయినట్లేనా?

వాషింగ్టన్: 26/11 ముంబయిపై దాడుల కేసులో కీలక నిందితుడైన తహవూర్ రాణాను భారత్‌కు అప్పగించడంపై కాస్త ముందడుగు పడింది. తనను భారత్ అప్పగించాలన్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ రాణా వేసిన ది రైటాఫ్ హెబియస్ కార్పస్ పిటిషన్‌ను అమెరికా కోర్టు కొట్టేసింది. అయితే, కోర్టు నిర్ణయాన్ని రాణా సవాల్ చేసేందుకు ఇంకా అవకాశాలు మిగిలే ఉన్నాయి. తహవూర్ రాణాను అప్పగించాలని భారత్ చేసిన అభ్యర్థనకు అనుకూలంగా ఇటీవల కాలిఫోర్నియా జిల్లా కోర్టు తీర్పు ఇచ్చింది. భారత్-అమెరికా మధ్య ఉన్న నేరస్థుల అప్పగింత ఒప్పందానికి అనుగుణంగా కోర్టు ఈ ఆదేశాలిచ్చింది. అయితే ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ రాణా.. ఇదే కోర్టులో ది రైటాఫ్ హెబియస్ కార్పస్ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఇది రెండు రకాలుగా అమెరికా-భారత్ నేరస్థుల అప్పగింత ఒప్పందాన్ని ఉల్లంఘిస్తుందని రాణా తరఫు అటార్నీ సదరు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇప్పటికే అమెరికాలో ఈ కేసుకు సంబంధించి అపరాధిగా తేలినా లేదా నిరపరాధిగా నిరూపించినా.. అమెరికా-భారత్ ఒప్పందం ప్రకారం సదరు వ్యక్తిని అప్పగించడం కుదరదని రాణా తరఫు అటార్నీ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే రాణాను ఇల్లినాయిస్ కోర్టు నిర్దోషిగా పేర్కొంది. అయితే రాణా వాదనలను తోసిపుచ్చిన కాలిఫోర్నియా జిల్లా కోర్టు.. అతడి పిటిషన్‌ను కొట్టేసింది. దీంతో రాణాను భారత్‌కు అప్పగించేలా అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఆదేశాలు జారీ చేసేందుకు మార్గం సుగమమైంది. అయితే, అప్పగింత ఆదేశాలను సవాల్ చేసేందుకు రాణాకు ఇంకా అవకాశాలున్నట్లు తెలుస్తోంది. రైటాఫ్ పిటిషన్ కొట్టివేయడాన్ని సవాల్ చేస్తూ రాణా నైన్త్ సర్క్యూట్ కోర్టులో అప్పీల్ చేశాడు. ఈ అప్పీల్‌పై విచారణ పూర్తయ్యేదాకా తన అప్పగింతపై స్టే విధించాలని కోరాడు. దీనిపై న్యాయస్థానం త్వరలోనే విచారణ జరపనుంది. 2008 నవంబర్ 26న ముంబయిలో ఉగ్రమూకలు జరిపిన భీకర దాడిలో దాదాపు 166 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ కేసులో రాణా కీలక నిందితుడిగా ఉన్నాడు. పాకిస్థాన్ మూలాలున్న రాణా.. ఆ దాడులకు ఆర్థిక సాయం చేశాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. అంతేగాక, ఈ కేసులో ప్రస్తుతం ప్రధాన నిందితుడిగా ఉన్న డేవిడ్ హెడ్లీకి ఇతడు అత్యంత సన్నిహితుడు. అలాగే దాడులకు ముందు ముంబయిలో తుది రెక్కీ నిర్వహించింది కూడా తహవూరేనని విచారణలో భాగంగా హెడ్లీ గతంలోనే వెల్లడించాడు.

కాగా.. మరో కేసులో ఉగ్రమూకలకు సాయం చేశాడన్న ఆరోపణల కింద గతంలో షికాగో కోర్టు 14 సంవత్సరాలు జైలు శిక్ష విధించింది. రాణా ప్రస్తుతం లాస్ ఏంజెలెస్‌లోని మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్‌లో శిక్ష అనుభవిస్తున్నాడు.

# శ్రీశైలంలో బోనులో చిక్కిన ఎలుగుబంటి



సున్నిపెంట సర్కిల్: శ్రీశైలం పరిధిలోని శిఖరేశ్వరం సమీపంలో సంచరిస్తున్న ఎలుగుబంటిని అటవీశాఖ అధికారులు శుక్రవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. గత రెండు రోజుల నుంచి శిఖరం సమీపంలో ఎలుగు సంచరించడంతో భక్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు.

ఈ నేపథ్యంలో అటవీశాఖ అధికారులు అప్రమత్తమై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శిఖరేశ్వరం సమీపంలో మూడు బోన్లను ఏర్పాటు చేశారు. శ్రీశైలం పరిధిలో చిరుత కూడా సంచరించడంతో అధికారులు, భక్తులను అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ అలాంగ్ చాంగ్ తెరాన్ అప్రమత్తం చేశారు. దీంతో ఎలుగుబంటి బోనులో చిక్కింది. తిరుపతిలో జరిగిన ఘటనల దృష్ట్యాలో శ్రీశైలంలో ముందస్తు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని అధికారులు ఆదేశించారు.

# శ్రావణమాసం మొదటి శుక్రవారం.. ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు



విజయవాడ: శ్రావణమాసం మొదటి శుక్రవారం కావడంతో ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయ అధికారులు అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహిస్తున్నారు. శ్రీ మహావిష్ణువు జన్మనక్షత్రం శ్రవణం కావడం వల్ల ఆ పేరుతో ఏర్పడిన శ్రావణమాసం అంటే శ్రీమహావిష్ణువు ధర్మపత్ని లక్ష్మీదేవికి ఎంతో ప్రీతిపాత్రమైనది. శ్రావణమాసంలో చేసే నోములు, వ్రతాలు, పూజల వల్ల లక్ష్మీకటాక్షం సిద్ధిస్తుందని భక్తులు విశ్వసిస్తారు. శ్రావణమాసం రెండవ శుక్రవారం నాడు మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తారు.

శ్రావణమాసంలో మహాలక్ష్మిని పూజించడం వల్ల పసుపు కుంకాలతో, సౌభాగ్యంతో ఉంటారని భక్తులు అమ్మవారిని కొలుస్తుంటారు. ఇంద్రకీలాద్రిపై శ్రావణమాసం సందర్భంగా నాలుగో శుక్రవారం నాడు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నారు.

# హీరో గారి భార్య 'హలో' కవర్ పిక్ వైరల్

సాధారణంగా ప్రముఖ మ్యాగజైన్స్ పై హీరోలు లేదా హీరోయిన్స్ కనిపిస్తూ ఉంటారు. అప్పుడప్పుడు డైరెక్టర్స్ లేదా ఫిల్మ్ డైరెక్టర్స్ కూడా ఉంటారు. అప్పుడప్పుడు క్రీడాకారుల కవర్ ఫోటోలు కూడా చూస్తూ ఉంటాం. ఎక్కువగా సినీ స్టార్స్ కనిపించే హలో మెగజైన్ పై ఈసారి హీరోగారి భార్య కనిపించి సందడి చేసింది. హలో మ్యాగజైన్ కవర్ పై తాజాగా టాలీవుడ్ హీరో రానా భార్య మిహిక దగ్గుబాటి కనిపించారు. హీరోయిన్ లకు ఏమాత్రం తక్కువ కాకుండా అందంగా కనిపించడంతో పాటు అందాల ఆరబోత విషయం లో కూడా హీరోయిన్స్ తో పోటీ పడుతుంది అన్నట్లుగా ఫోటో షూట్ ఉ




ంది. మిహిక ను రానా భార్యగా గుర్తు పట్టని వారు ఈమె ఏ భాష హీరోయిన్ అయి ఉంటుందని ఎంక్వైరీ చేస్తున్నారట. ఆ రేంజ్ లో అందంగా ఉన్న మిహిక కవర్ ఫోటో తో హలో మ్యాగజైన్ అందరి దృష్టిని ఆకర్షిస్తూ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మిహిక ను ఇంత అందంగా ఎప్పుడు చూడలేదు అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇక రానా సినిమాల విషయానికి వస్తే ఈ మధ్య కాలంలో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేయడం లేదు. ఇటీవలే హిరణ్య కశ్యప ప్రాజెక్ట్ ను అధికారికంగా ప్రకటించాడు. ఎప్పుడు ఆ సినిమా ప్రారంభం అవ్వబోతుంది అనే విషయం లో క్లారిటీ లేదు. రానా చేస్తున్న సినిమాలు తక్కువే అయినా కూడా పాన్ ఇండియా రేంజ్ లో గుర్తింపును సొంతం చేసుకున్నాడు.

# భూమిపైనే స్వర్గం చూపిస్తున్న బ్యూటీ

వింక్ బ్యూటీ ప్రియా ప్రకాష్ వారియర్ ఇన్ స్టా ఎలివేషన్లలో తనకు తానే పోటీ. అమ్మడు టెంప్టింగ్ ఫోజులకు కుర్రాళ్లకు మతి చెండాల్సిందే. స్కిన్ షో..క్లివేజ్ షో...థై షో ఏదైనా సరే అందులో తనదైన మార్క్ తప్పనిసరి. సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చిన బ్యూటీ కావడంతో తన పబ్లిసిటీ ప్లాన్ పక్కాగా ఉంటుంది. తాజాగా మరోసారి అమ్మడి అందాలు నెట్టింట దుమారం రేపుతున్నాయి. ఇదిగో ఇక్కడిలా బీచ్ రిసార్ట్స్ లో అగ్గి రాజేసే అందాలతో వెడెక్కిస్తుంది. జీన్స్ నిక్కర్.. వీపందం హైలైట్ అయ్యేలా డిజైన్డ్ దుస్తుల్లో మంటలు పుట్టిస్తుంది. వయ్యారంగా వెనుక వైపుగా చూస్తూ కెమెరాకి ఇచ్చిన ఫోజుకి కిక్ తప్పదు మరి. పెదాలతో పాటు కళ్లలోనూ చిన్న చిరు నవ్వును పలికిస్తుంది. ఆ సన్నని నవ్వుకు అంతే అందమైన కన్ను గీటు కూడా తోడైతే! ఆ కిక్కే వేరుగా ఉండేది. జస్ట్



మిస్ అన్ని ఒకేసారి అయితే ఎలా? అనుకుందో ఏమో! ఈసారి ఆ ఛాన్స్ తీసుకోలేదు. ఈ ఫోటోని ఉద్దేశించి ఓ బ్యూటీఫుల్ కామెంట్ పెట్టింది. భూమిపై స్వర్గం ఉంటే ఇలాగే ఉంటుందేమో. ఇది ఎంతో మనోహరమైన అనుభవం. మాటల్లో చెప్పలేని..పెదాలతో పలకలేని సంతోషంతో మనసంతా నిండిపోయింది. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. అభిమానులు తమదైన శైలిలో కామెంట్లు గుప్పిస్తున్నారు. అసలే బ్యూటీకి సోషల్ మీడియాలో పిచ్చ ఫాలోయింగ్ ఉంది. ఇప్పుడా నెంబర్ రెట్టింపు అవ్వడం ఖాయం. ఇటీవలే చీరందంలో తళుక్కున మెరిసింది. మోడ్రన్ దుస్తుల్లో కనిపించే వారియర్ ఒక్కసారిగా చీరందంలో కనిపించేసరికి కుర్రాళ్లంతా మరోసారి ఫిదా అయ్యారు. ఆ వెంటనే ఇలా మరోసారి మోడ్రన్ గాళ్ గా మారిపోయింది. కెరీర్ సంగతి చూస్తే ప్రియా వారియర్ పలు సినిమాల్లో నటిస్తోంది. ఆ సినిమా ల్లో ఈ ఏడాది ఎన్ని సినిమాలు వస్తాయి అనేది చూడాలి. మలయాళంతో పాటు ఇతర భాషల్లోనూ కొన్ని సినిమాలు చేసింది. ఈ ఏడాది అయినా హీరోయిన్ గా సక్సస్ అవుతుందా? అన్నది చూడాలి.




# 'బాయ్స్ హాస్టల్ గోలపాట్టే సాంగ్.. ఎలా ఉందంటే..




ఒకప్పుడు ఇతర ఇండస్ట్రీ హిట్? సినిమాలను మరో భాషలో రీమేక్ చేసేవారు. ఇప్పటికీ ఆ తంతు కొనసాగుతోంది. అయితే దీంతో పాటే డైరెక్ట్‌గా డబ్బింగ్ సినిమాల రిలీజ్?ల ట్రెండ్ ఈ మధ్య ఎక్కువైపోయింది. కంటెంట్ ఉంటే చాలు.. డబ్బింగ్‌గా వచ్చి ఇక్కడ ఆడియెన్స్‌ను అలరిస్తున్నాయి. ముఖ్యంగా కన్నడ సినిమాలకు ఈ మధ్య మరింత క్రేజ్ పెరిగింది. 'కేజీయఫ్', 'చార్లి 777', 'కాంతార' వంటి చిత్రాలు రిలీజై ప్రతి భాషలోను మంచి సక్సెస్‌ను అందుకున్నాయి. ఇప్పుడు మరో సినిమా రిలీజ్ కాబోతుంది. అదే 'హాస్టల్ హుడుగురు బేకాగిద్దరే'. చిన్న సినిమాగా రిలీజై, బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షాన్ని కురిపించింది. దీంతో ఈ సినిమా తెలుగులో వస్తుందా రాదా అని ఎంతో ఆసక్తిగా ఎదురు చూశారు యూత్ ఆడియెన్స్?. అందుకు తగ్గట్టే.. రీసెంట్‌గా 'బాయ్స్ హాస్టల్' పేరుతో ఈ సినిమాను తీసుకొస్తున్నట్లు అనౌన్స్ చేశారు. తాజాగా ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమా నుంచి 'ప్రొటెస్ట్' అనే సాంగ్ విడుదలైంది. ఈ సాంగ్ లిరిక్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, అందులోని సన్నివేశాలు ప్రతీది ఆకట్టుకునేలా ఉన్నాయి. 'ఫిజిక్స్ పేపర్‌లో కెమిస్ట్రీ రాసేసి.. తలమీద బరువంత దిగిపోద్ది అనుకుంటే.. పాసయ్యే ఆశేమో పచ్చడి లేని దోశాయే' అంటూ సాగిన లిరిక్స్‌ను మ్యూజిక్ హైలైట్‌గా నిలిచింది. హాస్టల్‌లో ఉన్న విదార్థులంతా సౌకర్యాలు సరిగ్గా లేవంటూ ఫన్నీగా ప్రొటెస్ట్ చేస్తున్నట్లు చూపించారు. ఈ పాటకు లిరిక్స్ భాస్కర భట్ల అందించగా.. సాయి చరణ్ ఆలపించారు. అజనీశ్ లోక్‌నాథ్ అందించిన మ్యూజిక్ హైలైట్?. క్రైమ్, కామెడీ నేపథ్యంలో ఈ సినిమా రూపొందింది. నవ్వులు పూయిస్తూనే ఉత్కంఠతో కన్నడ యూత్ ఆడియెన్స్‌ను అలరించింది. కుర్రాళ్ల హాస్టల్ లైఫ్ నేపథ్యంలో వచ్చిన ఈ సినిమాలో.. ఓ హాస్టల్ వార్డెన్ అనుమానాస్పద మృతి చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఇక ఈ చిత్రాన్ని అన్నపూర్ణా స్టూడియోస్, ఛాయ్ బిస్కెట్ సంయుక్తంగా కలిసి ఆగస్టు 26న విడుదల చేస్తున్నాయి. నితిన్ కృష్ణమూర్తి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో మంజునాథ్ నాయక, ప్రజ్వల్, తేజస్ జయన్న, శ్రీవాత్స, తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రం కన్నడ యువతను బాగా ఆకట్టుకుంది. ఇంకా ఈ సినిమాలో స్టార్ యాక్టర్స్ రమ్య, రిషబ్ శెట్టి, దర్శకుడు పవన్‌కుమార్ గెస్ట్ రోల్స్‌లో కనిపించి సందడి చేశారు. అజనీష్ లోకనాథ్ స్వరాలు సినిమాకు బాగా హైలైట్‌గా నిలిచాయి.

# జయమాలిని..సిల్క్ స్మితని మించిపోయేలా జాన్వీకపూర్!



క్లబ్ డాన్సర్స్ గా జయమాలిని..సిల్క్ స్మిత లాంటి వారు ఎంత ఫేమస్ అయ్యారో చెప్పాల్సిన పనిలేదు. ఇద్దరు గొప్ప నర్తకిలు. ఎంత గొప్ప డాన్సర్లో అంతకు మించి వాళ్ల ఆహార్యాలు అద్భుతంగా తెర పై పండేవి. క్లబ్ డాన్సర్ అంటే ఇలాగే ఉండాలని ఓ ట్రెండ్ సృష్టించి వెళ్లిపోయారు. ఆ తర్వాత తరం నటులు వాళ్ల లెగసీని అందుకోవాలని ప్రయత్నించారు గానీ ఫలించలేదు. క్లబ్ డాన్సర్స్ గా వాళ్లిద్దరికి వచ్చినంత పేరు..గుర్తింపు ఎవరికీ రాలేదు. ఆహార్యాల పరంగానూ ఎవరూ నూరుశాతం న్యాయం చేయలేదు. మరి ఆ ఛాన్స్ అతిలోక సుందరి శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్ ఏమైనా తీసుకుంటుందా? వాళ్లకి పోటీ గా నేను ఉన్నాను? అంటూ బరిలోకి దిగుతుందా? అంటే అవుననే అనేలా ఉందీ సన్నివేశం. జాన్వీ కొత్త ఫోటో ఒకటిప్పుడు ఇన్ స్టాని షేక్ చేస్తుంది. అందులో జాన్వీ అచ్చంగా క్లబ్ డాన్సర్ ఆహార్యంలోనే కనిపిస్తుంది. ఓసారి ఆ ఫోటోని పరిశీలిస్తే.. మోకాళ్ల వరకూ మెరిసే నక్షత్రాల షూస్...ఆ పైన థై అందాలు ఎలివేట్ అయ్యేలా స్కట్..మ్యాచింగ్ బ్లౌజ్ లో అమ్మడు మిరుమిట్లు గొలుపుతున్న వైనం అచ్చంగా క్లబ్ డాన్సర్ నే తలపిస్తుంది. ఆ నడుము మడత..నాభి అందాలు..వగరైన చూపు అన్ని కొత్త జాన్వీని పరిచయం చేస్తున్నాయి. క్లబ్ డాన్సర్ మాదిరి ఇచ్చిన ఆ ఫోజులు కుర్రాళ్ల కు నిద్ర లేకుండా చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ ఫోటో అంతార్జాలంలో కాక పుట్టిస్తుంది. జాన్వీ ఆహార్యం పై రకరకాల కామెంట్లు పడుతున్నాయి. జాన్వీ ఏ సినిమా లో నైనా క్లబ్ డాన్సర్ పాత్ర పోషిస్తుందా? లేక ! ఫ్యాషన్ ఎంపికలో భాగంగా ఇలాంటి దుస్తుల్లో దూరిపోయిందా? అంటూ కామెంట్లు పెడుతున్నారు. జాన్వీ త్వరగా క్లారిటీ ఇవ్వు. లేదంటే? ఇక్కడ క్లారిటీ మిస్ అవుతుందంటూ కుర్రాళ్ల వెర్రెత్తిపోతున్నారు. ఈ బ్యూటీ యంగ్ టైగర్ ఎన్టీఆర్ 30వ సినిమాతో టాలీవుడ్కి పరిచయమవుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే హిందీలో లాంచ్ అయింది. అక్కడ నిలదొక్కుకుంది. దీంతో సౌత్ మార్కెట్ పై కన్నేసినట్లు తెలుస్తుంది.

# మీరా జాస్మిన్.. ఇన్నాళ్ళకు ఫుల్ లెన్త్ రోల్

మీరా జాస్మిన్ ది చూపు తిప్పుకోనివ్వలేని అందం. ఆమెను స్పెషల్ గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఒకప్పుడు టాలీవుడ్ ని ఒక ఊపు ఊపేసింది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, రవితేజ వంటి స్టార్ హీరోల సరసన కూడా నటించింది. టాలీవుడ్ లో ఆమె నటించిన సినిమాలన్నీ దాదాపు హిట్ అయ్యాయి. కానీ సడెన్ గా ఏమైందో సినిమాలకు దూరమైంది. చాలా కాలం అసలు ఆమె ఎవరికీ కనిపించను కూడా కనిపించలేదు. కానీ, తాజాగా మళ్లీ తన సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టాలని చూస్తుంది. ఇటీవల విమానం లాంటి సినిమాలో ఓ చిన్న రోల్ లో మెరిసింది. కానీ, ఈ సారి ఆమెకు అలా చిన్న రోల్స్ లా కాకుండా, ఫుల్ లెన్త్ రోల్ ఛాన్స్ కొట్టేసిందని సమాచారం. అది కూడా ఓ యంగ్ హీరో సినిమాలో ఆమెకు ఛాన్స్ దొరికినట్లు తెలుస్తోంది. యంగ్ హీరో శ్రీవిష్ణు ప్రధాన



పాత్రలో ఓ సినిమా తెరకెక్కుతోంది.ఈ సినిమాలో రీతూ వర్మను హీరోయిన్ గా నటిస్తోంది. కాగా, మరో ప్రధాన పాత్రలో మీరా జాస్మిన్ ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకి స్వాగ్ అనే పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది. నిజానికి హీరోయిన్లకు సెకండ్ ఇన్నింగ్స్ అంటే, అక్క, వదిన లాంటి పాత్రలు లేదంటే, ఏ లాయర్, పోలీస్ లాంటి పాత్రలు మాత్రమే వస్తాయి. హీరోయిన్ గా రావడం చాలా అరుదు. కానీ, మీరా జాస్మిన్ కి హీరోయిన్ గా ఛాన్సులు రావడం అందరినీ షాకింగ్ కి గురి చేస్తుంది. మీరా జాస్మిన్ కెరీర్ మొదలుపెట్టిన కొత్తలో కొంచెం బొద్దుగా ఉండేది. కానీ చాలా అందంగా ఉండేది, ఇప్పుడు ఆమె వయసు నాలుగు పదులు దాటింది. సన్నగా, నాజుకు తీగలా మారింది. దీంతో, ఆమె అందం మరింత ఎక్కువగా పెరిగింది. అందుకే, ఆమెకు మళ్లీ అవకాశాలు క్యూ కడుతున్నాయి. ఇక సోషల్ మీడియాలోనూ తన పోస్టులతో మీరా జాస్మిన్ అదరగొడుతూ ఉంటుంది. ముఖ్యంగా క్లీవేజ్ అందాలతో అందరినీ ఆకర్షిస్తోంది. ఇక, మీరా జాస్మిన్ గుడుంబా శంకర్, భద్ర వంటి సినిమాల్లో నటించింది.

# వైట్ అండ్ టైట్ టాపులో మిల్క్ బ్యూటీ అందాలు..!

2005లో చాంద్ సా రోషన్ చెహ్రా అనే హిందీ సినిమాతో సినీ రంగంలో అడుగు పెట్టిన మిల్క్ బ్యూటీ తమన్నా.. అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ గా ఎదిగిపోయింది. అదే ఏడాది శ్రీ సినిమాతో తెలుగులో ఆ తర్వాత ఏడాది కేడీతో తమిళ ఇండస్ట్రీలోనూ అడుగు పెట్టింది. తన అందం అభినయంతో అతి తక్కువ కాలంలోనే టాప్ హీరోయిన్ గా మారిపోయింది. తన అందం అభినయం బాడీ స్ట్రక్చర్ తో తక్కువ సమయంలోనే మంచి క్రేజ్ సంపాదించుకుంది మిల్క్ బ్యూటీ తమన్నా భాటియా. సూపర్ స్ట్రక్చర్ కళ్లు చెదిరే అందం శిల్పి చెక్కినట్లుగా ఒంపులు తిరిగిన శరీరంతో కుర్రాళ్లలో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. అగ్ర హీరోల సరసన నటించి ఆహా అనిపించింది. 2005 నుంచి ఇప్పటి వరకు ఆమె ఇంకా స్టార్ హీరోయిన్ గానే కొనసాగుతోంది. అయితే తాజాగా ఈ క్యూట్ బ్యూటీ



ఫొటోలు నెట్టింట వైరల్ గా మారాయి. ఆమె ఎక్కడికో వెళ్లి వస్తుండగా.. ఎయిర్ పోర్టులో మీడియా కంట పడింది. దీంతో వెంటనే వాళ్లు ఫొటోలు తీయడం నెట్టింట షేర్ చేయడం... వైరల్ గా మారడం చకచకా జరిగిపోయాయి. అయితే తమన్నా ఈ ఫొటోల్లో బ్లాక్ జీన్స్ విత్ వైట్ టైట్ టాప్ వేసుకుంది. అందులో ఎద అందాలు చాలా క్లియర్ గా కనిపిస్తున్నాయి. వైట్ షూస్ విత్ బ్లాక్ కలర్ టాప్ ఓ స్లిమ్ హ్యాండ్ బ్యాగ్ వేసుకొని చాలా స్టైలిష్ గా కనిపిస్తోంది. ముద్దుగా ముద్ద బంతిలా నవ్వుతూ అందిరనీ మైమరిపిస్తోంది. ఈ ఫొటోలు చూసిన ప్రతీ ఒక్కరూ తమన్నా స్టైల్ కు స్మైల్ కు ఫిదా అయిపోతున్నారు. నీ అందం అదిరింది నిన్ను చూస్తేనే పిచ్చెక్కిపోతుంది ఈ అందం ఏంటమ్మడు అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇక ప్రస్తుతం తమన్నా చేతిలో ఒకటీ అర సినిమాలు తప్ప పెద్దగా అవకాశాలు రావడం లేదు. ప్రస్తుతం తెలుగులో భోళా శంకర్ సినిమాలో చిరు సరసన నటిస్తోంది. హిందీలో పలు వెబ్ సిరీస్ లు చేస్తున్నట్లు సమాచారం. తమిళంలో సూపర్ స్టార్ రజినీ కాంత్ జైలర్ సినిమాలో కూడా తమన్నాకు ఛాన్స్ వచ్చింది. తెలుగులో రీసెంట్ గా సత్యదేవ్ తో కలిసి గుర్తుందా శీతాకాలం సినిమా చేసిన తమన్నా.. ఆ తర్వాత వేరే ప్రాజెక్టులు ఒప్పుకున్నట్లు లేదు.





# తాటికొండ రాజయ్య - కడియం శ్రీహరి టికెట్ వార్ స్టార్ట్..

వరంగల్ : స్టేషన్ ఘనపూర్‌లో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య-ఎమ్మెల్సీ కడియం శ్రీహరి మధ్య టికెట్ వార్ ప్రారంభమైంది.

అసలే ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుందన్న విషయం తెలిసిందే. ఇప్పటికే వారిద్దరి మధ్య మాటల వార్ చాలా సార్లు జరిగింది. చివరకు అధిష్ఠానం కల్పించుకుంటే కానీ ఆ వార్ ఆగలేదు. ఇక ఇప్పుడు టికెట్ వార్. తనకే బీఆర్ఎస్ నుంచి టికెట్ వస్తుందని తన అనుచరులతో కడియం శ్రీహరి సమావేశం ఏర్పాటు చేశారు. ఇవాళ తన నిర్ణయం ప్రకటించేందుకు సిట్టింగ్ ఎమ్మెల్యే రాజయ్య సిద్ధమయ్యారు.
ఈ క్రమంలోనే భద్రకాళి గుడిలో రాజశ్యామల యాగం చేస్తున్నారు. యాగం అనంతరం నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది.




# లెక్కలన్నీ పక్కాగా.... - రేవంత్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్: తనను ఓడించడానికి సీఎం కేసీఆర్ పోలీసులను వాడుకుంటున్నారని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఆరోపించారు. సెక్యూరిటీ, కోకాపేట భూములు, మైనార్టీల విషయంపై రేవంత్‌రెడ్డి మీడియాతో చిట్‌చాట్ చేశారు. "కోర్టు చెప్పినా ప్రభుత్వం నాకు సెక్యూరిటీ ఇవ్వడం లేదు. ఎంపీగా ఉన్నాను.. జాతీయ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న నాకు సెక్యూరిటీ తొలగిస్తారా?, కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్‌కి కావాల్సినంత సెక్యూరిటీ ఇచ్చాం. నేను ప్రజల మనిషిని. నాకు సెక్యూరిటీతో పని లేదు. నేను సెక్యూరిటీ లేకుండా ఎక్కడికైనా వెళ్తాను. సెక్యూరిటీ లేకుండా ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలకు కేసీఆర్ రాగలరా?, సెక్యూరిటీ విషయంలో నన్ను భయపెట్టాలని చూస్తే భయపడేవాడ్ని కాదు. లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు నా సైన్యం. నా సెక్యూరిటీ వాళ్లే. ఎన్నికల సమయం వచ్చినప్పుడు పొత్తుల గూర్చి ఏఐసీసీ చూసుకుంటుంది." అని రేవంత్ తెలిపారు.

**మైనార్టీలు కాంగ్రెస్ వైపే..** "కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ మైనార్టీ అనే తేడా ఉండదు. కాంగ్రెస్ పార్టీలో మైనార్టీలు చాలా పెద్ద పొజిషన్‌లో ఉన్నారు. టీఆర్ఎస్ పార్టీ మైనార్టీల కోసం ఏం చేయలేదు. డబుల్ బెడ్రూమ్ ఇండ్లలో ఒక్క పర్సెంట్ కూడా మైనార్టీలకు దక్కలేదు. ఇక్కడ కారు బయల్దేరి ఢిల్లీకి చేరే వరకు అది కమలంగా మారిపోతోంది. బీఆర్ఎస్‌కి ఓటేస్తే బీజేపీకి ఓటేసినట్టే. కేసీఆర్ మైనార్టీ ఓట్లను బీజేపీకి అమ్ముకుంటున్నారు. మైనార్టీలందరూ కాంగ్రెస్ వైపే చూస్తున్నారు. బీజేపీ తెచ్చిన ప్రతి ప్రజా వ్యతిరేక బిల్లుకి కేసీఆర్ మద్దతు ఇచ్చారు. బీజేపీ-బీఆర్ఎన్ వేర్వేరు కాదు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్నామని చెప్పడానికి ఎక్కడికైనా వస్తాం. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్నామని గుడి, మసీదు, చర్చి ఎక్కడికైనా వచ్చి చెప్తాం. బీఆర్ఎస్ వాళ్లు అలా చెప్పగలరా?, అన్ని డిపార్ట్‌మెంట్లలో కొందరు అధికారులు ప్రభుత్వ తాబేదార్లుగా ఉంటారు. ప్రభుత్వానికి తొత్తులుగా పని చేసే అధికారుల పేర్లను తప్పకుండా రెడ్ బుక్‌లో రాస్తాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అలాంటి అధికారులపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం కోసం కాంగ్రెస్ నాయకులపై తప్పుడు కేసులు పెట్టే వాళ్ళని వదిలిపెట్టం. ప్రభాకర్ రావు, రాధా కిషన్ రావు, భుజంగ రావు, నర్సింగ్ రావు లాంటి అధికారులనే నేను అనేది. ప్రజల కోసం పని చేసే అధికారులపై నాకెప్పుడూ గౌరవం ఉంటుంది. ప్రభుత్వ అధికారులుగా ఉంటూ వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ గెలుస్తారని అంటున్న వాళ్ల విషయంలో సైలెంట్‌గా ఎలా ఉంటాం. అధికారులకు రాజకీయాలతో ఎం సంబంధం?, పది సంవత్సరాల్లో చేయనిది రెండు నెలల్లో ఎలా చేస్తారు?." అని రేవంత్ నిలదీశారు.

**బీఆర్ఎస్ నేతలు ఆ స్థాయికి ఎదిగారు :** "ఒక్క ఎకరానికి వంద కోట్లు పెట్టగలిగేలా బీఆర్ఎస్ నేతలు ఎదిగారు. పేద ప్రజలు మాత్రం పేదలుగానే ఉంటున్నారు. కోకాపేట, బుద్వేల్‌లో భూములు కొన్న సంస్థల పేర్లు ఎందుకు చెప్పడం లేదు. కోకాపేట, బుద్వేల్‌లో భూములు కొన్నది బీఆర్ఎస్ నాయకులు, కేసీఆర్ బీనామీలే." అని రేవంత్ ఆరోపించారు.

# మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దాం.. ప్రజలకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పిలుపు

హైదరాబాద్ : పర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహాలనే పూజిద్దామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలపై రూపొందించిన పోస్టర్‌ను మంత్రి శుక్రవారం సచివాలయంలో ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను ప్రతి ఏటా పంపిణీ చేస్తోందని, ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, కలర్స్, కెమికల్స్‌తో చేసిన విగ్రహాల కారణంగా పర్యావరణానికి తీవ్రంగా నష్టం జరుగుతోందన్నారు. చవితి ఉత్సవాల్లో కాలుష్యానికి కారణమయ్యే, ప్రజలకు ఇబ్బందులు కలిగించే పద్ధతులను పక్కన పెట్టి పర్యావరణహిత గణేశ్ విగ్రహాలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. మండపాల్లో, ఇండ్లలోనూ పర్యావరణహిత వినాయక ప్రతిమలను ప్రతిష్టించి, పూజించాలని కోరారు. తద్వారా పర్యావరణాన్ని



కాపాడడంతో పాటు మట్టి గణపతులను నిమజ్జనం చేయడం ద్వారా కలుషితమయ్యే నీటిని నివారించవచ్చని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ సోషల్ సైంటిస్ట్ ప్రసన్న కుమార్, ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో టీటీడీపీ ఆధ్వర్యంలో బస్సు యాత్ర



హైదరాబాద్: తెలంగాణలో టీటీడీపీ ఆధ్వర్యంలో బస్సు యాత్ర చేయనున్నారు. గ్రేటర్ హైదరాబాదు పరిధిలో జరిగే బస్సు యాత్రలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పాల్గొంటారు. ఈ నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్‌లో బస్సు యాత్రకు రూట్ మ్యాప్ సిద్ధమైంది. బస్సు యాత్ర జూబ్లీ హిల్స్ పెద్దమ్మగుడి నుంచి ప్రారంభం కానుంది. బస్సు యాత్రపై శనివారం చంద్రబాబు నాయుడు డేట్స్ ఫిక్స్ చేస్తారు. ఈ సందర్భంగా టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరం అభివృద్ధికి చంద్రబాబే కారణమన్నారు. గ్రేటర్‌లో టీడీపీ బస్సు యాత్రను విజయవంతం చేస్తామని స్పష్టం చేశారు.

# సీఎం కేసీఆర్ పర్యటనకు సూర్యాపేటలో చకచకా ఏర్పాట్లు.. దగ్గరుండి పరిశీలిస్తున్న మంత్రి జగదీశ రెడ్డి

సూర్యాపేట : ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 20న సూర్యాపేటలో పర్యటించనున్న నేపథ్యంలో భారీ ఏర్పాట్లు చేసేందుకు మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ప్రణాళికలు తయారు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి సూర్యాపేట జిల్లాకు సాగునీటిని అందించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు చెప్పేందుకు రైతాంగంతోపాటు అనేక పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న సిద్ధమవుతున్నారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లను మంత్రి జగదీశ్ రెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

ఈ క్రమంలోనే సభకు తరలివచ్చే ప్రజల సౌకర్యార్థం నలువైపులా ఉన్న రహదారులను మరమ్మతు చేయాలని ఇటీవల అధికారులను ఆదేశించగా.. ఆ పనులను ఇవాళ ఉదయం నేరుగా పరిశీలించారు. సభకు తరలివచ్చే వారికోసం అన్ని ఏర్పాట్లు చేయాలని.. అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని నేతలకు సూచించారు. ఈ నెల 20న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా నూతన సమీకృత కలెక్టరేట్ భవనం, జిల్లా పోలీసు కార్యాలయం, మెడికల్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ మోడల్ మార్కెట్, సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌తోపాటు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం మొత్తం ఆరు ప్రారంభోత్సవాలు ఉండనున్నాయి. అనంతరం స్థానిక వ్యవసాయ మార్కెట్ పక్కన 70 ఎకరాల స్థలంలో భారీ బహిరంగ సభ జరుగనుంది. ఈ నేపథ్యంలో సూర్యాపేట పట్టణంతోపాటు నాలుగు మండలాల నుంచి జనాన్ని తరలించేందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను ఇన్‌చార్జిలుగా నియమించారు. వారంతా గురువారం తమకు కేటాయించిన ప్రాంతాల్లో రంగంలోకి దిగారు. స్థానిక నాయకత్వంతో కో ఆర్డినేట్ చేసుకుంటూ సీఎం సభకు వచ్చేవారు తిరిగి ఇంటికి వెళ్లే వరకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా వాహనాల ఏర్పాటు తదితరాలను చూసుకుంటున్నారు. అలాగే.. ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన, ఆయన చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ఆయా ప్రాంతాల్లో ఆటోలు, కార్ల ద్వారా మైకుల్లో ప్రచారం చేపడుతున్నారు.




# పోలీసులకు హారతిచ్చి వై.ఎస్.షర్మిల నిరసన...

గజ్వేల్: సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో పర్యటించేందుకు వెళ్లాలనుకున్న వైఎస్సార్ తెలంగాణ పార్టీ (వైతెపా) అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలను పోలీసులు గృహనిర్బంధం చేశారు. దళితబంధులో అక్రమాలు జరిగాయంటూ ఇటీవల గజ్వేల్‌లోని జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామస్థులు ఆందోళన చేశారు. వారికి మద్దతుగా అక్కడ పర్యటించాలని నిర్ణయించుకున్న షర్మిలను అనుమతి లేదంటూ పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఆమె నివాసం లోటస్‌పాండ్ వద్ద పోలీసులు మోహరించారు. గజ్వేల్ వెళ్లి తీరుతానంటూ పోలీసులతో షర్మిల వాగ్వాదానికి దిగగా.. అనుమతి లేదని పోలీసులు తేల్చి చెప్పారు.

**దేనికోసం అనుమతి తీసుకోవాలి?** పోలీసులు గృహనిర్బంధం చేయడంపై షర్మిల వినూత్నంగా నిరసన తెలిపారు. గజ్వేల్ పర్యటనకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులకు హారతి ఇచ్చారు. డ్యూటీ సరిగా చేయండి సార్ అని వ్యాఖ్యానించారు.

గజ్వేల్‌లో నిరసన తెలుపుతున్న భారాస నేతలను ఎందుకు అరెస్టు చేయడం లేదని షర్మిల ప్రశ్నించారు. "పోలీసులు సీఎం కేసీఆర్ తొత్తుల్లా పనిచేయడం మానుకోవాలి. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని వదిలి మమ్మల్ని పట్టుకుంటున్నారు. దేనికోసం అనుమతి తీసుకోవాలి? ప్రజలకు సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చాం. ప్రజలను కలవడానికి అనుమతి తీసుకోవాలా? కేసీఆర్ నన్ను చూసి భయపడుతున్నారు" అని షర్మిల అన్నారు.

**ఇంటి వద్దే దీక్షకు దిగిన షర్మిల** గజ్వేల్ పర్యటనను అడ్డుకున్నందుకు నిరసనగా లోటస్‌పాండ్‌లోని తన నివాసం వద్ద షర్మిల దీక్షకు దిగారు.

# సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రను నేటి తరానికి అందించాలి: కిషన్‌రెడ్డి



చౌటుప్పల్: బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన సాహసి సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రను నేటి తరానికి అందించేందుకు విద్యార్థుల పాఠ్య పుస్తకాల్లో చేర్చాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో ఆయన విగ్రహానికి కిషన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మొఘలులకు వ్యతిరేకంగా గొరిల్లా యుద్ధంతో పోరాడి అనేక కోటలను స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. ఇలాంటి మహనీయుల చరిత్రను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా గత సంవత్సరం సర్వాయి పాపన్న తపాలబిళ్ల, పోస్టల్ కార్డును ప్రధాని విడుదల చేశారని చెప్పారు. సర్వాయి పాపన్న లక్ష్యాలను గుర్తుచేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దూడల భిక్షంగౌడ్, నాయకులు జంగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బహుజనుల ఆత్మగౌరవానికి సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తి: ఎంపీ లక్ష్మణ్

హైదరాబాద్: సబ్బండ వర్గాలకు సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తి అని భాజపా ఎంపీ, ఆ పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు లక్ష్మణ్ అన్నారు. సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటం వద్ద లక్ష్మణ్ సహా నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ బహుజనుల ఆత్మగౌరవ పోరాటానికి ఆయన స్ఫూర్తి అని చెప్పారు. దొరలు, జమిందారులు, మొఘలులను ఓడించిన ధీరుడు సర్వాయి పాపన్న అని కొనియాడారు. వృత్తిని అవహేళన చేసి అగౌరవంగా వ్యవహరించిన వారిపై ఆయన తిరుగుబాటు చేశారని చెప్పారు. రాష్ట్రంలో భాజపా అధికారంలోకి వస్తే నిజమైన చరిత్రకారులను వెలుగులోకి తీసుకొస్తామన్నారు. కులవృత్తుల వారికి సాయంగా 'విశ్వకర్మ యోజన' పథకాన్ని ప్రధాని మోదీ తీసుకొస్తున్నారని చెప్పారు. రూ.13వేల కోట్లతో 30లక్షల కుటుంబాలకు ఊతమివ్వనున్నారని లక్ష్మణ్ వివరించారు. మాజీ ఎంపీ



బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ తెలంగాణలో కాకతీయుల తర్వాత బహుజన వీరుడు సర్వాయి పాపన్న అని చెప్పారు.




హైదరాబాద్: నగరంలో బెగ్గింగ్ రాకెట్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఛేదించారు. దీనికి సంబంధించి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, కేబీఆర్ పార్క్ వద్ద 23 మంది యాచకులను అరెస్ట్ చేశారు. వీరితో భిక్షాటన చేయిస్తున్న బెగ్గింగ్ మాఫియా నిర్వాహకుడు అనిల్ పవార్‌ను కూడా అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. 23 మంది బిచ్చగాళ్లను రెస్క్యూహోంకు తరలించినట్లు వివరించారు. నిర్వాహకుడిపై భిక్షాటన నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెగ్గింగ్ నిర్వాహకుడు అనిల్ వివిధ ప్రాంతాల నుంచి వృద్ధులను తీసుకొచ్చి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, పరిసర ప్రాంతాల్లో వారితో బెగ్గింగ్ చేయిస్తున్నాడు. యాచకులందరి నుంచి రోజుకు రూ.4,500 నుంచి రూ.6,000 వరకు తీసుకుంటాడు. దీనికి ప్రతిగా ఒక్కో బిచ్చగాడికి రోజుకు రూ.200 కూలిగా చెల్లిస్తున్నాడు. సిగ్నల్స్ వద్ద భిక్షాటనతో ఇబ్బందులకు గురైనవారు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఈ బెగ్గింగ్ రాకెట్‌ను ఛేధించాం. మరికొద్ది రోజుల పాటు ఈ డ్రైవ్ కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు.

# పైరవీలకు తావులేకుండా లబ్ధిదారుల ఎంపిక : మంత్రి వేముల

నిజామాబాద్ : డబుల్ బెడ్ రూమ్ పథకంలో ఎలాంటి పైరవీలకు తావులేకుండా, పారదర్శకంగా అధికార యంత్రాంగం లబ్ధిదారులను ఎంపిక చేసిందని రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలకు అనుగుణంగా, రాజకీయ జోక్యానికి తావు లేకుండా అర్హత ప్రాతిపదికన ఇండ్లు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని మోర్తాడ్ మండల కేంద్రంలో శుక్రవారం ప్రభుత్వం నూతనంగా నిర్మించిన రెండు పడక గదుల ఇళ్ల సముదాయాన్ని ఆయన ప్రారంభించారు. లబ్ధిదారులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి, నూతన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పత్రాలను లబ్ధిదారులకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఒకే సముదాయంలో అన్ని వసతులతో మొత్తం 224 రెండు పడక గదుల ఇళ్లను నిర్మించగా, తొలివిడతగా 155 మంది లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేశామని ఆయన అన్నారు. లబ్ధిదారుల కోరిక మేరకు సముదాయానికి కేసీఆర్ కాలనీ గా నామకరణం చేశారు. మోర్తాడ్ లో డబుల్ నిర్మాణాల కోసం రూ. 15 కోట్లు మంజూరు చేయించానని, అందులో రూ. 13.5 కోట్లు ఇళ్ల నిర్మాణాలకు వెచ్చించగా మిగతా నిధులతో రోడ్ల నిర్మాణాలు జరిపించామని వివరించారు. అర్హులైన వారిని ఎంపిక చేసేలా అధికారులకు పూర్తి స్వేచ్ఛ కల్పించామని పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సైతం జోక్యం చేసుకోకుండా లబ్ధిదారుల ఎంపిక జరిగిందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి దశల వారీగా ఇళ్లను పంపిణీ చేస్తామని భరోసా కల్పించారు. ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శివలింగు శ్రీనివాస్, జడ్పీటీసీ రవి, డీసీసీబీ వైస్ చైర్మన్ రమేష్ రెడ్డి, ఆర్మూర్ ఆర్డీవో వినోద్ కుమార్, ఆర్ అండ్ బీ ఎస్ఈ రాజేశ్వర్ రెడ్డి, డీఎల్‌పీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com